1
నవతెలంగాణ
మనుగడ తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్
శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

కొనుగోలు కేంద్రాల పరిశీలన

నవతెలంగాణ-జన్నారం

మండలం పలు గ్రామాల్లో ఐకెపి, పిఎసిఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను జిల్లా ఉన్నతాధికారులు పరిశీలించారు. శుక్రవారం సివిల్ సప్లై డీఎం శ్రీలత, డీఎస్ఓ బ్రహ్మారావు మండలంలోని కలమడుగు, ఇందన్‌పల్లి, పోన్కల్, మొర్రిగూడలలో వరి ధాన్యం కొనుగోలు కేంద్రాలను పరిశీలించారు. కొనుగోలు కేంద్రం నిర్వాహకులకు సూచనలు చేశారు. ధాన్యంలో తేమ లేకుండా చూడాలన్నారు. తాలు, తప్పలు లేకుండా నాణ్యమైన వరి ధాన్యాన్ని తూకం వేయాలని సూచించారు. కొనుగోలు కేంద్రాలకు వచ్చే రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలన్నారు.



పాక్‌పట్ల పాఠశాలను సందర్శించిన ఎంఈఓ

నవతెలంగాణ-నిర్మల్‌రూరల్

సోన్ మండలంలోని పాక్‌పట్ల ఉన్నత పాఠశాలను మండల విద్యాధికారి తొడిశెట్టి పరమేశ్వర్ శుక్రవారం సందర్శించారు. మధ్యాహ్న భోజన వంటగదిని పరిశీలించారు. అనంతరం నేషనల్ అచీవ్మెంట్ సర్వేపై విద్యార్థులకు అవగాహన కల్పిస్తూ పదో తరగతి విద్యార్థులకు పలు సూచనలు చేశారు. ఇన్‌చార్జి హెచ్ఎం చంద్రశేఖర్‌రావు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



దళారీ దందా..!

- అనుమతి లేకుండా సాగుతున్న పత్తి, సోయా కొనుగోళ్లు
- జిల్లా, మండల కేంద్రాల్లో విచ్చలవిడిగా వెలిసిన దుకాణాలు
- మార్కెట్ ఆదాయానికి భారీగా గండి
- నోటీసులతో సరిపెడుతున్న అధికారులు

ఆదిలాబాద్ జిల్లాలో అనుమతి లేని పత్తి, సోయా కొనుగోళ్లకు అంతులేకుండా పోతోంది. ప్రభుత్వం నుంచి ఎలాంటి అనుమతులు తీసుకోకుండా యథేచ్ఛగా దందా సాగిస్తున్నారు. ఫలితంగా మార్కెట్‌కు రావాల్సిన పత్తి, సోయా పంటలు మధ్య దళారుల పరమవుతున్నాయి. కొనుగోళ్ల ద్వారా పన్నుల(సెస్) రూపంలో మార్కెట్‌కు రావాల్సిన ఆదాయం మార్కెట్ కోల్పోవాల్సి వస్తోంది. ప్రతి ఏటా ఇలా అక్రమ కొనుగోళ్లు సాగుతున్నా..అధికార యంత్రాంగం అటువైపు దృష్టిసారించడం లేదనే విమర్శలున్నాయి. ఎవరైనా ఫిర్యాదు చేస్తే అక్కడికి వెళ్లి కొందరికి నోటీసులు జారీ చేయడం.. ఆ తర్వాత మామూలుగా తీసుకోవడం పరిపాటిగా మారుతోంది. ఈ దళారీ దందా కారణంగా రైతులకు తక్కువ ధర రావడం.. కొనుగోళ్లలో సరైన ప్రామాణికాలు పాటించకపోవడంతో అన్నదాతలు నష్టపోవాల్సి వస్తోందనే ఆరోపణలున్నాయి.



నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

జిల్లాలో పత్తి, సోయా కొనుగోళ్ల పర్వం ఊపందుకుంది. పత్తి కొనుగోళ్లు అంటేనే ఆదిలాబాద్ మార్కెట్ గుర్తుకువస్తోంది. ముఖ్యంగా ఉమ్మడి జిల్లాలో పత్తి ప్రధాన పంట కావడంతో కొనుగోళ్లతో మార్కెట్ కళకళలాడుతోంది. మరోపక్క ఇదే అదనుగా ఈ పంట కొనుగోళ్ల ప్రారంభం కాగానే దళారులు సైతం అనుమతి లేకుండా కొనుగోళ్లు చేస్తుండటం పరిపాటిగా మారుతోంది. కొనుగోళ్లకు సంబంధించి ప్రభుత్వం ఎలాంటి అనుమతులు తీసుకోకుండా..రైతుల సమాచారం అవసరం లేకుండా జీరో దందాలో కొనుగోళ్లు చేస్తుంటారు. ఈ దందా కోసం ఆదిలాబాద్ పట్టణ శివారు ప్రాంతాల్లో అనేక దుకాణాలు వెలిశాయి. రైతుల నుంచి తక్కువ ధరకు కొనుగోలు చేసి మళ్లీ అదే పత్తిని అధిక ధర ఉన్న సమయంలో మార్కెట్‌లో విక్రయిస్తుంటారు.ఇలా కొనుగోలు చేసిన పత్తి, సోయా పంటలను వివిధ ప్రాంతాలకు చెందిన రైతుల పేరిట మార్కెట్‌లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు. ఇది వరకు ఈ దందా ఆదిలాబాద్ శివారు ప్రాంతాలకే పరిమితం కాగా.. ప్రస్తుతం మండల కేంద్రాల్లోనూ అనేక దుకాణాలు వెలిశాయి. కొందరు మధ్య దళారులు నేరుగా రైతుల వద్దకే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. మారుమూల ప్రాంతాలకు చెందిన అనేక మంది రైతులు మార్కెట్‌కు తీసుకెళ్లే ఇబ్బందులు తప్పుతాయనే కారణంగా తక్కువ ధరకైనా అక్కడే విక్రయిస్తున్నట్లు తెలుస్తోంది. మరోపక్క సోయా పంటకు సంబంధించి ప్రభుత్వానికి విక్రయిస్తే డబ్బులు వచ్చేందుకు పక్షం రోజుల సమయం పడుతుంది..అదే దళారులకు విక్రయిస్తే అప్పుడే డబ్బులు చెల్లిస్తుంటారు.

మార్కెట్ ఆదాయానికి గండి..!

జిల్లాలో అనుమతి లేకుండా.. ఎలాంటి లైసెన్సులు లేకుండా కొందరు దళారులు సాగిస్తున్న దందాతో మార్కెట్ ఆదాయానికి భారీగా గండిపడుతోంది. మార్కెట్‌కు రావాల్సిన పత్తి, సోయా పంటలు ఆయా దుకాణాలకు వెళుతుండటంతో మార్కెట్ సెస్ రావడం లేదు. మార్కెట్ కార్యాలయం నుంచి లైసెన్సులు తీసుకోవాల్సి ఉండగా.. ఇందుకోసం డబ్బులు చెల్లించాల్సి రావడంతో అనేక మంది తీసుకునేందుకు ఇష్టపడటం లేదని తెలుస్తోంది. అధికారులను మచ్చిక చేసుకొని ఏండ్లుగా ఈ దందాను కొనసాగిస్తున్నట్లు తెలుస్తోంది. ఎక్కువగా పది క్వింటాల్ల లోపు పత్తి, సోయా కలిగిన రైతులు ఈ దుకాణాల్లో విక్రయిస్తున్నారని తెలుస్తోంది. మరోపక్క కొందరు వ్యాపారులు చేన్ల దగ్గరికే వెళ్లి కొనుగోలు చేస్తున్నారు. తూకం వేసే కాంటాలు సక్రమంగా ఉన్నాయా..లేవా..అనేది కూడా ఎవరూ చూడని పరిస్థితి ఉంటుంది. ఇది మంచి లాభసాటి వ్యాపారంగా మారడంతో అనేక మంది ఈ దుకాణాలను తెరుస్తున్నట్లు తెలుస్తోంది. మార్కెట్ అధికారులు గత కొన్నేండ్ల నుంచి వీరికి నోటీసులు జారీ చేస్తున్నా.. చర్యలు మాత్రం తీసుకోవడం లేదు. కేవలం నోటీసులతోనే సరిపెడుతున్నారనే ఆరోపణలున్నాయి.

నోటీసులు జారీ చేశాం : మధుకర్, మార్కెట్ కార్యదర్శి

ఆదిలాబాద్ చుట్టుపక్కల వెలిసిన దుకాణాలకు లైసెన్సులు లేవు. ఒకసారి వెళ్లి పరిశీలించగా దుకాణాలు మూసి ఉన్నాయి. కొన్నింటికి నోటీసులు జారీ చేశాం. మరోసారి పరిశీలించి చర్యలు తీసుకుంటాం.

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్



నవతెలంగాణ-నిర్మల్

నిర్మల్ మండలం వెంగ్వాపేట్ గ్రామంలో పిఎసిఎస్ మంజులాపూర్ సొసైటీ ఆధ్వర్యంలో నెలకొల్పిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ శుక్రవారం పరిశీలించారు. రైతుల నుండి ఇప్పటివరకు సేకరించిన ధాన్యం నిల్వల గురించి కేంద్రాల నిర్వాహకులను వివరాలు అడిగి తెలుసుకున్నారు. రైతుల సౌకర్యార్థం కేంద్రంలో అందుబాటులో ఉంచిన సదుపాయాలను పరిశీలించారు. కేంద్రానికి ధాన్యం తీసుకువచ్చిన రైతులను పలకరించి, కొనుగోలు కేంద్రాల్లో ఏమైన ఇబ్బందులు ఉన్నాయా? అని ఆరా తీశారు. రైతులకు కేంద్రాల్లో అన్ని సదుపాయాలను అందుబాటులో ఉంచాలని, ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా చూడాలన్నారు. అన్ని శాఖల అధికారులు పరస్పర సమన్వయంతో పనిచేస్తూ ధాన్యం కొనుగోలు ప్రక్రియ పూర్తి స్థాయి లక్ష్యానికి అనుగుణంగా సాఫీగా కొనసాగేలా కృషి చేయాలని సూచించారు. రైతులు ధాన్యం తెచ్చిన వెంటనే తూకం వేయించి, లారీలలో లోడ్ చేసి నిర్దేశిత రైస్ మిల్లులకు పంపించాలని, మిల్లుల వద్ద ధాన్యం అన్‌లోడింగ్ వెంటది వెంట జరిగేలా పర్యవేక్షణ జరపాలన్నారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ రత్నకళ్యాణి, డిఎస్ఓ కిరణ్ కుమార్, డిఎం గోపాల్, ఏడి మార్కెటింగ్ శ్రీనివాస్, గ్రామీణ తహసీల్దార్ సంతోష్ ఉన్నారు.

ఆర్జీయూకేటీని ఎస్పీ దత్తత తీసుకోవటం అభినందనీయం



నవతెలంగాణ-ముధోల్

బాసర ఆర్జీయూకేటీని ఎస్పీ జానకి షర్మిల దత్తత తీసుకోవటం అభినందనీయంమని వీసీ గోవర్ధన్ అన్నారు. బాసర ఆర్జీయూకేటీని గొప్ప సంకల్పంతో దత్తత తీసుకునే కార్యక్రమాన్ని స్టూడెంట్ ఆక్టివిటి సెంటర్‌లో శుక్రవారం సాయంత్రం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి వైస్ ఛాన్స్‌లర్ ప్రొఫెసర్ గోవర్ధన్, ఎస్పీ జానకి షర్మిల హాజరయ్యారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడారు. ఎస్పీ జానకి షర్మిల క్యాంపస్‌ను దత్తత తీసుకోవడం వారి ఉదారమైన స్వభావానికి నిదర్శనమని తెలిపారు. విద్యార్థులకు అందించిన సహాయానికి ఎస్పీకి కృతజ్ఞతలు తెలిపారు. విద్యార్థులకు నాణ్యమైన విద్య, ఆరోగ్య సంరక్షణ, పాఠ్యేతర కార్యకలాపాలకు అందించడమే లక్ష్యంగా కలిసి పనిచేస్తామని వీసీ తెలిపారు. ఈ కార్యక్రమంతో విద్యార్థులలో బాధ్యత, సమాజ సేవా భావాన్ని పెంపొందించుకోవడానికి దోహదపడుతుందని పేర్కొన్నారు. ఎస్పీ మాట్లాడుతూ ఆర్జీయూకేటీ అభివృద్ధి పథంలో సంపూర్ణ సహాయం, సమగ్ర రక్షణ కోసం దత్తత తీసుకోవడం జరిగిందని తెలిపారు. బాధ్యత కలిగిన పౌరురాలిగా, చట్టాన్ని అమలు చేసే అధికారిణిగా, సమాజానికి తిరిగి ఇవ్వడం తన కర్తవ్యమని అన్నారు. ఆర్జీయూకేటి విద్యార్థులకు వారి లక్ష్యాలను సాధించడంలో వారికి అవసరమైన మద్దతు, మార్గదర్శకత్వం అందించడానికి కట్టుబడి ఉన్నానని ఎస్పీ స్పష్టం చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ అవినాష్ కుమార్, అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ రణధీర్ సాగి, అసోసియేట్ డీన్ స్టూడెంట్ వెల్ఫేర్ నాగరాజు, అధికారులు, విద్యార్థులు పాల్గొన్నారు.

టీపీసీసీ విస్తృతస్థాయి సమావేశంలో బోరంచు శ్రీకాంత్‌రెడ్డి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

గాంధీభవన్‌లో జరిగిన టీపీసీసీ విస్తృత స్థాయి సమావేశంలో కిసాన్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బోరంచు శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. టిపిసిసి చీఫ్ మహేష్‌కుమార్‌గౌడ్ అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో ఉపముఖ్యమంత్రి బట్టి విక్రమార్క, మంత్రులు సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డితో పాటు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాకు చెందిన పలువురు కాంగ్రెస్ నాయకులు హాజరయ్యారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటై ఏడాది పూర్తి కావస్తున్న సందర్భంగా ప్రజాపాలన విజయోత్సవాల సంబరాలు, రాష్ట్ర ప్రభుత్వం చారిత్రాత్మకంగా చేపట్టిన కులగణన, రాబోయే స్థానిక సంస్థలు ఎన్నికలు, ప్రభుత్వం ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలపై సమావేశంలో చర్చ జరిగినట్లు పేర్కొన్నారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న ప్రజాపాలన ప్రజా విజయోత్సవ కార్యక్రమాలను కాంగ్రెస్ పార్టీ శ్రేణులు విజయవంతం చేయాలని కోరారు.

నలుగురు సంఘ విద్రోహులు అరెస్ట్

- మరణాయుధాలు స్వాధీనం
- తొమ్మిది మందిపై కేసు, పరారీలో ఐదుగురు
- కేసు వివరాలు వెల్లడించిన ఎస్పీ గౌస్‌ఆలం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

అక్రమంగా తరలిస్తున్న మరణాయుధాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఈ కేసులో తొమ్మిది మందిపై ఆదిలాబాద్ రూరల్ పోలీస్‌స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. నలుగురు సంఘ విద్రోహులను అరెస్ట్ చేశారు. మరో ఐదుగురు పరారీలో ఉన్నారు. నాలుగు పిస్టల్స్, 8 మ్యాగజిన్స్, 18 రౌండ్స్ బుల్లెట్లు స్వాధీనం, 6 సెల్‌ఫోన్లు స్వాధీనం చేసుకున్నారు. కేసు వివరాలను శుక్రవారం ఎస్పీ మీడియా సమావేశంలో వెల్లడించారు. ఉమ్మడి కర్నూలు జిల్లాలో ప్రభుత్వ నిషేధిత జనశక్తి దళ పున:ఏర్పాటుకు నిందితులు ఏర్పాట్లు చేస్తుండగా జిల్లా పోలీసులు పక్క సమాచారంతో వారిని పట్టుకున్నారు. ఏ1గా వెంకటరెడ్డి గతంలో జనశక్తి పార్టీలో పనిచేసి అరెస్టు అయ్యాడు. సూర్యాపేట జిల్లాలో మిత్రుడి హత్య కేసుకు ప్రతీకార చర్యగా, అదేవిధంగా జనశక్తి పార్టీని తిరిగి ఉమ్మడి కర్నూలు జిల్లాలో స్థాపించడానికి నల్లగంటి ప్రసన్నరాజు ఆర్థిక సాయం చేశాడు. వెంకటరెడ్డికి అనుచరుడు ఏ3 హిమకాంత్‌రెడ్డి, ఏ2 దిలీప్, రెస్టారెంట్‌లో పనిచేసే భైరవ్ చెప్పిన వ్యక్తితో కలిసి కాశీకి వెళ్లి ఉండగా, వారితో వచ్చిన వ్యక్తి బీహార్ రాష్ట్రం మ్యంగార్ రైల్వేస్టేషన్‌కు వెళ్లి పిస్టల్స్, బుల్లెట్లను సేకరించి తిరిగి కాశీకి వచ్చారు. తిరిగి వెళ్లే క్రమంలో చాందా(టి) బైపాస్ రోడ్డు వద్ద పక్కా సమాచారంతో ఆదిలాబాద్ రూరల్ ఎస్సై ముజాహిద్, సిబ్బంది కలిసి తనిఖీ చేశారు. దిలీప్, హిమకాంత్‌రెడ్డితో పాటు నాలుగు 7.65ఎంఎం పిస్టల్స్, 8 మ్యాగజైన్లు, 18 లైవ్ రౌండ్‌లను, కారును స్వాధీనం చేసుకున్నారు. గురువారం రాత్రి ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కేసులో ప్రధాన నిందితులుగా ఉన్న సూత్రధారి వెంకటరెడ్డి, పిస్టల్స్ కొనుగోలుకు ఆర్థిక సాయం చేసిన ఏ4 ప్రసన్న రాజును అదే రాత్రి అరెస్టు చేశారు. శుక్రవారం రూరల్ పోలీస్‌స్టేషన్‌కు తీసుకొచ్చారు. ఈ కేసులో ఏ2 మైల దిలీప్, శ్రీశైలం రుచులు అనే రెస్టారెంట్ ఏర్పాటు అనుమతులపై తనకు పరిచయమున్న ఏ1 వెంకటరెడ్డికి సున్నిపెంట గ్రామంలో ఆదిత్య రెస్టారెంట్ యజమానిని సాయం కోరాడు. తర్వాత మైల దిలీప్ రెస్టారెంట్లో పని చేసే బీహార్‌కు చెందిన భైరవతో బేరం కదుర్చుకొని వెంకటరెడ్డి ఇంటి నుండి నల్లగంటి ప్రసన్న రాజు చేసిన ఆర్థిక సాయం డబ్బులు తీసుకొని దిలీప్, హిమకాంత్‌రెడ్డి, కుక్ భైరవ్ చెప్పిన వ్యక్తి సాయంతో కాశీకి వెళ్లి అక్కడ రెండు రోజులపాటు ఉండి బీహార్ గ్యంగిర్ రైల్వేస్టేషన్‌లో పిస్టల్స్‌ను తీసుకొని ఆదిలాబాద్ మీదుగా తిరిగి వస్తున్న క్రమంలో అరెస్టు చేశారు. వెంకటరెడ్డిపై ఇదివరకే టాడా, వివిధ సంఘవిద్రోహం, హత్య కేసులు ఉన్నాయి. మిగతా నిందితులను అరెస్టు చేయడానికి ఆంధ్రప్రదేశ్, బీహార్, తెలంగాణ రాష్ట్రాలకు పంపడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేశామని ఎస్పీ తెలిపారు. నిందితులను పట్టుకోవడంలో కీలక పాత్ర పోషించిన పోలీసు అధికారులను, సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించారు. సమావేశంలో అదనపు ఎస్పీ బి సురేందర్‌రావు, డీఎస్పీ జీవన్‌రెడ్డి, సిఐలు కె.ఫణిదర్, కరుణాకర్, డి.సాయినాథ్, ఎస్సైలు ముజాహిద్ పాల్గొన్నారు.



మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలోని బీసీ స్టడీ సర్కిల్‌లో నెహ్రూ యువ కేంద్రం ఆధ్వర్యంలో మాదకద్రవ్యాల దుర్వినియోగంపై అవగాహన కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థులకు మాదక పదార్థాల వలన కలిగే దుష్ప్రభావాలను వివరించారు. అనంతరం మాదక పదార్థాలను నిరోధించాలని విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఈ కార్యక్రమంలో స్టడీ సర్కిల్ డైరెక్టర్ ప్రవీణ్‌కుమార్, సఖి కేంద్ర ఇన్చార్జి సరస్వతి, డవ్ సంస్థ ఎన్జీవో మేనేజర్ చంద్రశేఖర్‌రెడ్డి, జిల్లా మిషన్ కోఆర్డినేటర్ యశోద, నెహ్రూ యువ కేంద్రం అకౌంటెంట్, సురేష్, మాజీద్, స్టడీ సర్కిల్ సిబ్బంది నరేష్, ఎర్రమ్మ, శ్రీవాణి పాల్గొన్నారు.

పోరాటాలతో మూడు పార్టీలకు బుద్ధి చెప్పాలి

- సింగరేణిని కాపాడుకోవాలి
- ప్రజలకు, కార్మికులకు సీపీఐ(ఎం) పిలుపు
- సింగరేణి పరిరక్షణకు సంతకాల సేకరణ పూర్తి



నవతెలంగాణ-మంచిర్యాల

ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలు అవలంభిస్తున్న బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు పోరాటాలతోనే బుద్ధి చెప్పాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శి సంకె రవి అన్నారు. కార్మికులు ఐక్యంగా ఉండి సింగరేణిని కాపాడుకోవాలని పేర్కొన్నారు. పార్టీ ఆధ్వర్యంలో 5రోజులుగా జిల్లా వ్యాప్తంగా సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. శుక్రవారం కాసిపేట, నస్పూర్, శ్రీరాంపూర్ ప్రాంతాల్లో సంతకాలు సేకరించారు. వీటిని శనివారం రాష్ట్ర నాయకత్వానికి అప్పగించనున్నారు. సంతకాల సేకరణ సందర్భంగా సంకె రవి మాట్లాడుతూ కేంద్రంలోని మోడీ ప్రభుత్వం బొగ్గు బ్లాక్‌ల వేలం పాటను రద్దు చేసి సింగరేణి కేటాయించాలని డిమాండ్ చేశారు. అంబానీని శత కోటీశ్వరుడిగా చేయడానికి జియో పేరుతో బీఎస్ఎన్ఎల్‌ను బలి తీసుకున్నారని తెలిపారు. నేడు బొగ్గు బ్లాక్‌ల వేలం పాట పేరుతో ఆదానీకి కట్టబెట్టడం, ప్రపంచంలో మొదటి కుబేరుడిని చేయడం కోసం సింగరేణి సంస్థను బలిపీఠం ఎక్కించడం జరుగుతోందని తెలిపారు. ప్రజలు, కార్మికుల శ్రమతో కూడబెట్టిన లక్షల కోట్ల బీఎస్ఎన్ఎల్, సింగరేణి ఆస్తులను ఆదానీ, అంబానీలకు కట్టబెట్టడం కోసమే మోడీ ప్రభుత్వం పని చేస్తోందని విమర్శించారు. దీంతో వ్యవసాయానికి, గృహాలకు ఉచిత కరెంట్ లేకుండా పోతోందన్నారు. తెలంగాణ ప్రజలకు ఇంత పెద్ద ప్రమాదం ఉన్నా రాష్ట్రంలోని కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు, నాయకులు బెల్లం కొట్టిన రాయిలాగా ఉన్నారని పేర్కొన్నారు. సింగరేణి సంస్థను, ఉచిత విద్యుత్‌ను, తెలంగాణ అభివృద్ధిని కాపాడుకోవడం కోసం కార్మికులు, ప్రజలు బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలకు తగిన బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు సిడాం జంగుబాయి పలువురు కార్మికులు పాల్గొన్నారు.



పిల్లలకు దుస్తులను పంపిణీ చేయడం హర్షణీయం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

చలికాలాన్ని దృష్టిలో ఉంచుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో శిశుగృహకు హీటర్‌తో పాటు పిల్లలకు దుస్తులను పంపిణీ చేయడం హర్షణీయమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. సత్యసాయిబాబా 99వ పుట్టిన రోజును పురస్కరించుకొని సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో సమాజ సేవ కార్యక్రమాల్లో భాగంగా శుక్రవారం శిశుగృహలోని చిన్నారులకు దుస్తులు, ఇతర వస్తువులను అందించారు. దీనికి డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య ముఖ్య అతిథిగా హాజరై నిర్వాహకులకు వాటిని అందించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ సామాజిక సేవలో స్వచ్ఛంద సంస్థలు ముందుకు రావాలన్నారు. సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో ఇప్పటికే అనేక కార్యక్రమాలు కొనసాగుతున్నాయన్నారు. సత్యసాయి జన్మదినం సందర్భంగా పిల్లలకు బట్టలు, చలి కాలం దృష్ట్యా వాటర్ హీటర్‌ను అందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి సభ్యులు నర్సింహరావు, గంగారాం, విజయ్‌రెడ్డి, అశోక్, వీణ, శిశు గృహ నిర్వాహకులున్నారు.

యువతిని మోసం చేసిన వ్యక్తికి పదేండ్ల జైలు

నవతెలంగాణ-వాంకిడి

యువతిని పెళ్లి చేసుకుంటానని మాయ మాటలు చెప్పి లైంగికదాడి చేసిన కేసులో నిందితుడికి 10 సంవత్సరాల జైలుశిక్ష, 25వేల రూపాయల జరిమానా విధిస్తూ జిల్లా ప్రిన్సిపాల్ అండ్ సెషన్ కోర్ట్ ప్రధాన న్యాయమూర్తి ఎంవి రమేష్ తీర్పు ఇచ్చారు. ఎస్ఐ ప్రశాంత్ తెలిపిన వివరాల ప్రకారం..తేజాపూర్ గ్రామానికి చెందిన నగోషే వినేష్ అదే గ్రామానికి చెందిన యువతిని 3 సంవత్సరాలుగా ప్రేమిస్తున్నానని చెప్పి, పెళ్లి చేసుకుంటానని శారీరకంగా లొంగదీసుకున్నాడు. యువతి కుటుంబ సభ్యులు పెళ్లి చేసుకోవాలని వినేష్‌ని అడగగా అతను నిరాకరించాడు. దీంతో సదరు యువతి 2021 నవంబర్ 20న పోలీసులకు ఫిర్యాదు చేయగా నిందితుడిపై కేసు నమోదు చేసి కోర్టులో హాజరు పరిచారు. నేరం రుజువు కావడంతో నిందితుడికి జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెలువరించారు. యువతీ కేసులో నిందితుడికి శిక్ష పడేలా చేసిన పోలీసులను ఎస్పీ అభినందించారు.

పోలీస్‌స్టేషన్‌ను సందర్శించిన డీఎస్పీ

నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్‌ను వార్షిక తనిఖీల్లో భాగంగా శుక్రవారం ఉట్నూర్ డీఎస్పీ నాగేందర్ సందర్శించారు. అనంతరం రికార్డులను పరిశీలించి, సిబ్బందికి పలు సూచనలు చేశారు.



అదే విధంగా రానున్న రోజుల్లో పంచాయతీ ఎన్నికలు ఉన్నందున విలేజ్ పోలీస్ వ్యవస్థను పటిష్టంగా అమలు చేస్తు, పని చేయాలని, జాతీయ రహదారిపై నిరంతరం గస్తీ నిర్వహిస్తు ప్రజలకు ఎల్లపుడు అందుబాటులో ఉండి మెరుగైన సేవలు అందించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ సీఐ భీమేష్, నేరడిగొండ ఎస్సై శ్రీకాంత్, పోలీస్ స్టేషన్ సిబ్బంది పాల్గొన్నారు.

నవతెలంగాణ

సమగ్ర తెలుగు దినపత్రిక

ఆదిలాబాద్-నిర్మల్

శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

సమగ్ర సర్వే డేటా పకడ్బందీగా నమోదు చేయాలి

నవతెలంగాణ-సారంగాపూర్

సమగ్ర కుటుంబ సర్వే డేటాను పకడ్బందీగా నమోదు చేయాలని జిల్లా పంచాయతీ అధికారి శ్రీనివాస్ అన్నారు. శుక్రవారం ఎంపీడీఓ కార్యాలయంలో మండల డాటా ఎంట్రీ నిర్వాహకులకుతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. ఇదివరకు ఇచ్చిన శిక్షణ ప్రకారం కుటుంబ సర్వే వివరాలను తప్పులు లేకుండా కంప్యూటర్‌లో నమోదు చేయాలని సూచించారు. ఈసందర్భంగా వారు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు. కార్యక్రమంలో మండల ప్రత్యేకాధికారి బాలిగ్ అహ్మద్, ఎంపీడీఓ లక్ష్మి కాంతారావు, ఎంపీఓ అజీజ్‌ఖాన్, ఏపీఓ లక్ష్మారెడ్డి పాల్గొన్నారు.



ఆర్టీసీ ఆదాయ పెంపులో భాగస్వాములు కావాలి

- ఉత్తమ ఉద్యోగులకు సన్మానం



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆర్టీసి సంస్థ పురోగతిలో ఉద్యోగుల పాత్ర ఎంతో ఉందని ప్రతి ఉద్యోగి సంస్థను తన సొంత ఆస్తిగా భావిస్తూ చిత్తశుద్ధితో పనిచేసి సంస్థ ఆదాయ పెంపులో భాగస్వాములు కావాలని ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ అన్నారు. గడిచిన మూడు నెలల కాలంలో ఉత్తమ సేవలు అందించి సంస్థ ఆదాయం పెంపునకు కృషిచేసిన పలువురు డ్రైవర్లు, ఉద్యోగులను సన్మానించారు. శుక్రవారం స్థానిక డిపో ఆవరణలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో రీజియన్ పరిధిలోని ఆరు డిపోలకు చెందిన ఉత్తమ ఉద్యోగులను శాలువాతో సత్కరించి ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా ఆర్టీసీ ఆర్ఎం సోలోమన్ మాట్లాడుతూ ఉద్యోగులు విధినిర్వాహణతో పాటు తమ వ్యక్తిగత ఆరోగ్యంపై శ్రద్ధ చూపాలన్నారు. నిస్వార్థ సేవలతో సంస్థ పురోభివృద్ధికి భాగస్వామ్యం అందిస్తున్న ఉద్యోగులను అభినందించారు. ఉద్యోగుల సమిష్టి కృషి వల్లే గతం కన్నా సంస్థ ఆర్థిక పరిస్థితులు ఎంతో మెరుగుపడ్డాయన్నారు. డ్రైవర్లు, సిబ్బంది విధి నిర్వాహణలో అప్రమత్తంగా ఉంటూ ప్రమాద రహిత, జిల్లాగా ఆదిలాబాద్‌ను తీర్చిదిద్దాలన్నారు. మహిళా ప్రయాణీలకు పట్ల మర్యాదపూర్వకంగా మెదలాలని సూచించారు. కార్యక్రమంలో డిపోల మేనేజర్లు కల్పన, జనార్ధన్, విశ్వనాథ్, హరిప్రసాద్, పీఓ గిబా, ఎఓ శంకరయ్య సూపరింటెండెంట్ శివదాస్, పోతారెడ్డి పాల్గొన్నారు.

మండల కేంద్రంలోనే పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలి

నవతెలంగాణ-బేల

మండల కేంద్రంలోనే డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని కొనసాగించాలని కోరుతూ ఏబీవీపీ జిల్లా హాస్టల్ కన్వీనర్ మాడవార్ హరీష్‌రెడ్డి విద్యార్థులతో కలిసి స్థానిక అంబేద్కర్ చౌక్ వద్ద శుక్రవారం ధర్నా చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ప్రతి సంవత్సరం డిగ్రీ సెమిస్టర్లు ప్రారంభిస్తున్నారంటే పరీక్ష కేంద్రాన్ని జిల్లా కేంద్రానికి మార్చుకోవడం మానుకోవాలని అధికారులను కోరారు. మండల కేంద్రంలో నిర్వహిస్తున్న డిగ్రీ పరీక్ష కేంద్రాన్ని ఆదిలాబాద్‌కు మారుస్తున్నట్లు కాకతీయ యూనివర్సిటీ అధికారులు తెలపడం పట్ల తప్పు పట్టారు. మారుమూల గ్రామాల నుంచి డిగ్రీ విద్యార్థులు 32 నుంచి 50కిలో మీటర్ల దూరంలోని జిల్లా కేంద్రానికి వెళ్లాలంటే చాలా ఇబ్బందులు పడాల్సివస్తుందని అన్నారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ జిల్లా ఎస్ఎఫ్‌డీ కన్వీనర్ మనోజ్‌రెడ్డి, నవనిత్, తరుణ్, ప్రీతం, సూరజ్, సాయిరెడ్డి, సుమిత్ పాల్గొన్నారు.

చలో హైదరాబాద్ పోస్టర్ల ఆవిష్కరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిసెంబర్ 1న జరగబోయే ఛలో హైదరాబాద్ మాలల సింహగర్జనను విజయవంతం చేయాలని మాల సంక్షేమ సంఘం నాయకులు పిలుపునిచ్చారు. శుక్రవారం పట్టణంలోని ప్రెస్‌క్లబ్‌లో నాయకులతో కలిసి ఛలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మాల సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు కొప్పుల రమేష్, గౌరవాధ్యక్షుడు మేకల మల్లన్న, సంయుక్త కార్యదర్శి రాజేశ్వర్, అశోక్, అసోసియేషన్ అధ్యక్షులు మలపతి సుభాష్, పాశం రాఘవేంద్ర, ముచ్చ రఘు, పోచన్న, రాములు పాల్గొన్నారు.

డిజిటల్ లావాదేవీలపై అవగాహన ఉండాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

డిజిటల్ లావాదేవిలపై విద్యార్థులతో పాటు వయోవృద్దులు అవగాహన కలిగి ఉండాలని ఆర్డీఓ వినోద్ కుమార్ అన్నారు. హెల్ప్ ఏజ్ ఇండియా ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్ర వయోవృద్ధుల సమాఖ్య సహకారంతో డిజిటల్ గురుకుల కార్యక్రమం శుక్రవారం సరస్వతి శిశుమందిర్ పాఠశాలలో నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆర్డీఓ వినోద్ కుమార్ మాట్లాడుతూ ప్రస్తుత కాలంలో డిజిటల్ లావాదేవిలు పెరిగిపోయాయన్నారు. ఈ క్రమంలోనే సైబర్ నేరగాళ్ల మోసాలకు పాల్పడుతున్నారన్నారు. వాటి గురించి వయోవృద్ధులతో పాటు విద్యార్థులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. సరస్వతి శిశు మందిరాలు క్రమశిక్షణ, గౌరవానికి నిలయాలుగా ఉన్నాయన్నారు. ఇక్కడ చదివే విద్యార్థులకు ఇతర పాఠశాలలో చదివే విద్యార్థులకు చాలా తేడ ఉంటుందన్నారు. తల్లిదండ్రులు వారిపై పెట్టిన నమ్మకాన్ని కాపాడుతు ఉన్నతంగా రాణించాలని ఆకాక్షించారు. కార్యక్రమంలో వయోవృద్దుల సమాఖ్య అధ్యక్షుడు దేవిదాస్ దేశ్‌పాండే, కార్యదర్శి రాంకులకర్ణి, విశ్రాంత ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు కంది లక్ష్మారెడ్డి, గుండా వామన్‌రావ్, కె.సుధాకర్, హన్మంత్ రెడ్డి, నీలాకిషన్, ఆర్. కిషోర్ పాల్గొన్నారు.

శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలి

- కలెక్టర్ రాజర్షిషా
- శిక్షణ పూర్తిచేసుకున్న అభ్యర్థులకు సర్టిఫికెట్ల అందజేత



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నిరుద్యోగులు స్వయం ఉపాధిలో రాణించేలా అందించే వృత్తి నైపుణ్య శిక్షణలను సద్వినియోగం చేసుకోవాలని జిల్లా కలెక్టర్ రాజర్షిషా సూచించారు. వైటీసీ కేంద్రంలో శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులకు శుక్రవారం సర్టిఫికేట్లను పంపిణీ చేశారు. దీనికి కలెక్టర్ ముఖ్యఅథితిగా హాజరై ఆయా విభాగాల్లో శిక్షణ పూర్తి చేసుకున్న మహిళలు, అభ్యర్థులతో మాట్లాడి శిక్షణ గురించి అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి సర్టిఫికేట్లను అందించి స్వయం ఉపాధిలో రాణించాలని ఆకాంక్షించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాజర్షిషా మాట్లాడుతూ మహిళలతో పాటు నిరుద్యోగులు స్వయం ఉపాధిలో రాణించేలా ప్రభుత్వ పరంగా వృత్తి నైపుణ్య శిక్షణాలను అందిస్తున్నామన్నారు. టైలరింగ్‌లో శిక్షణ పూర్తి చేసిన మహిళలు డ్వాక్ర గ్రూపుల్లో చేరితే వారికి వడ్డీ లేని రుణాలతో వ్యాపారాలను ప్రారంభించవచ్చని తెలిపారు. మహిళ పథకం గురించి తెలియజేయడం జరుగుతుందని, అందులో కూడా వ్యాపారానికి సంబంధించిన కొన్ని యూనిట్లు ఉన్నాయన్నారు. శిక్షణ తీసుకున్న మహిళలు ఖర్చులు తగ్గించి ఆదాయం పెంచుకునేలా రాణించడం సంతోషంగా ఉందన్నారు. అదే విధంగా ఏసీ, ఫ్రిడ్జ్ మెకానిక్‌లు కూడా వేరేవేరుగా కాకుండా ముగ్గురు నాలుగు ఒక యూనిట్‌గా ఏర్పడి వ్యాపారాన్ని ప్రారంభించాలన్నారు. దానికి కోసం కూడా రుణాలను అందించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎస్ఓ వెంకటేశ్వర్లు, డీడబ్ల్యూఓ సబిత, వైటీసీ కేంద్రం నిర్వాహకులు అభ్యర్థులు పాల్గొన్నారు.

అబద్ధాల సీఎంగా రేవంత్‌రెడ్డి

- మాజీ మంత్రి జోగు రామన్న

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

సీఎం రేవంత్‌రెడ్డి ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయకుండా కేవలం అబద్ధాలు మాట్లారని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు మాజీ మంత్రి జోగు రామన్న ఆరోపించారు. శుక్రవారం పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన మీడియా సమావేశంలో మాట్లాడారు. అబద్దాల సీఎంగా రేవంత్ రెడ్డి కీర్తి పొందారన్నారు. ఆడ బిడ్డలకు అండగా బీఆర్ఎస్, కేసీఆర్ తీసుకువచ్చిన పథకాలను తీసివేసేలా వ్యవహరిస్తున్నారన్నారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను కూడా అమలు చేయడం లేదన్నారు. నిరుద్యోగులు, యువత, రైతులు, మహిళలకు ఇలా అన్ని వర్గాల వారికి అన్యాయం చేశారన్నారు. దేవుళ్ల ప్రమాణం చేసి వాగ్దానాలను విస్మరించి, సీఎం రేవంత్‌రెడ్డిపై ఎందుకు కేసు నమోదు చెయొద్దని ప్రశ్నించారు. మహారాష్ట్ర ఎన్నికల ప్రచారంలో తెలంగాణలో 50వేల ఉద్యోగాలు ఇచ్చిమని గొప్పలు చెప్పారన్నారు. కేవలం పత్రాలు ఇచ్చారని ఆరోపించారు. పోలీసులు సీఎంపై 420 కేసు నమోదు చేయాలని డిమాండ్ చేశారు. లేని పక్షంలో తాము జిల్లా నుంచి ప్రయివేట్ కేసు ఫైల్ చేస్తామని అన్నారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ మెట్టు ప్రహ్లాద్, కుమ్ర రాజు, గంగయ్య, కౌన్సిలర్లు అశోక్, పందిరి భూమన్న, పండ్ల శ్రీనివాస్, వెనుగంటి ప్రకాష్, బట్టు సతీష్, సజన్, దయానంద్, లక్ష్మణ్, అరవింద్ పాల్గొన్నారు.



ట్రిపుల్ ఐటీ ఆకస్మిక తనిఖీ

- విద్యార్థులతో కలిసి సౌకర్యాలపై ఆరా
- విద్యార్థులతో కలిసి భోజనం చేసిన ఎమ్మెల్యే
- వైస్ ఛాన్స్‌లర్‌తో సమస్యలపై చర్చ



నవతెలంగాణ-భైంసా

బాసర ట్రిపుల్ ఐటీని ఎమ్మెల్యే పవార్ రామారావు పటేల్ శుక్రవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఇటీవల ట్రిపుల్ ఐటీలో స్వాతి అనే విద్యార్థి ఆత్మహత్య చేసుకోవడం, పెద్ద మొత్తంలో విద్యార్థి సంఘాల నాయకులు ఆందోళన చేపట్టిన విషయం తెలిసిందే. అందులో భాగంగానే ఆయన బాసర ట్రిపుల్ ఐటీకి వెళ్లి విద్యార్థులను కలిసి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ప్రతిష్టాత్మక విద్యాసంస్థలో ఆత్మహత్యలు ఎందుకు జరుగుతున్నాయన్న విషయంలో ఆరా తీశారు. విద్యార్థులు ఆత్మహత్య చేసుకొని తమ బంగారు భవిష్యత్తును నాశనం చేసుకోవద్దని, ఏదైనా సమస్యలుంటే తనకు నేరుగా కాల్ చేయాల్సిందిగా సూచించారు. ఏదైనా కష్టం వస్తే ఆత్మహత్య పరిష్కారం కాదని, సమస్యను తోటి మిత్రులకు, తల్లిదండ్రులకు, అధ్యాపకుల దృష్టికి తీసుకురావాలన్నారు. విద్యతో ఏదైనా సాధించగలుగుతామని, మనిషికి ఆస్తులు, అంతస్తుల కంటే విద్యకే ప్రాధాన్యమని చెప్పారు. విద్యార్థులతో కలిసి భోజనం చేసి, ట్రిపుల్ ఐటీలో బోధన, క్రీడా, ఇతరత సౌకర్యాలపై ఆరా తీశారు. అనంతరం వైస్ ఛాన్స్‌లర్ గోవర్ధన్‌తో సమావేశమయ్యారు. విద్యార్థుల ఆత్మహత్యల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని సూచించారు. ఆదేవిధంగా విద్యార్థులకు అందుతున్న ప్లేస్మెంట్స్‌ను అడిగి తెలుసుకున్నారు. ఏయే కంపెనీల్లో విద్యార్థులు ఉద్యోగాలకు సెలెక్ట్ అవుతున్నారన్న విషయంపై చర్చించారు. ఈ సందర్భంగా ట్రిపుల్ ఐటీ అధ్యాపకులు ఎమ్మెల్యేకు కొన్ని సమస్యలను తెలియజేశారు. సమస్యలను కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించేందుకు చర్యలు చేపడతానని అన్నారు. తాను ఇచ్చిన మాట ప్రకారం విద్య పైనే ప్రధాన దృష్టి సారిస్తానని అందులో భాగంగానే పలుమార్లు ట్రిపుల్ ఐటీని సందర్శించడం జరిగిందని, సమస్యలపై మొట్టమొదటిసారిగా అసెంబ్లీలో ప్రస్తావించిన విషయాన్ని ఆయన గుర్తు చేశారు. విద్యార్థులు ఎలాంటి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, అన్ని రకాల సౌకర్యాలు కల్పిస్తానన్నారు. ఎమ్మెల్యే వెంట భైంసా మార్కెట్ కమిటీ మాజీ చైర్మెన్ రాజేష్‌బాబు, నాయకులు వెంగళరావు ఉన్నారు.

బీటీ రోడ్డు నిర్మాణానికి భూమిపూజ

నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రోడ్లు భవనాలశాఖ నుంచి మంజూరైన నిధులతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం భూమిపూజ చేశారు. పల్లి(బి), పల్లి(కె) ఒక్కొక్క గ్రామానికి రూ. 2.33 కోట్లు మంజూరు కాగా, భరంపూర్ నుంచి అర్లి(కె) గ్రామం వరకు రూ. 2 కోట్లతో బీటీ రోడ్ల నిర్మాణానికి భూమిపూజ చేశారు. అనంతరం సదరు కాంట్రాక్టర్ పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌కు ఆయా గ్రామాల ప్రజలు శాలువాతో ఘనంగా సన్మానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజన గ్రామాలకు కూడా చక్కటి రోడ్ల సౌకర్యం కల్పించాలన్న గత బీఆర్ఎస్ ప్రభుత్వ ఆలోచనతో ఈ రోడ్లకు నిధులు మంజూరు చేశారని గుర్తు చేశారు. యేండ్ల కలగా మిగిలిన రోడ్లకు బీఆర్ఎస్ ప్రభుత్వం నిధులు మంజూరు చేసినందుకు ధన్యవాదాలు తెలిపారు. మీ మంచి కోరే వ్యక్తిగా ఎల్లప్పుడూ మీ కష్ట సుఖాల్లో భాగమవుతానని తెలిపారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ తోట వెంకటేష్, బీఆర్ఎస్ నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, రమేష్, లక్ష్మణ్, అభిరామ్‌రెడ్డి, రాంబాయి, పల్లవి, శాస్త్రి, అబ్దుల్లా, రమాకాంత్, సుభాష్‌రెడ్డి, మాజీ సర్పంచ్ రమేష్‌రెడ్డి, డి.రాజేషుడు, సుదర్శన్ రెడ్డి, వివిధ గ్రామాల నుంచి వచ్చిన నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



పాఠశాలను సందర్శించిన విద్యార్థి సంఘం నాయకులు



నవతెలంగాణ-నేరడిగొండ

మండలంలోని కొరిటికల్(కె) ఆశ్రమ పాఠశాలను శుక్రవారం తెలంగాణ ఆదివాసీ విద్యార్థి సంఘం రాష్ట్ర సహాయ కార్యదర్శి సందర్శించి, పిల్లలతో మాట్లాడి వారి సమస్యలు తెలుసుకున్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టడం లేదని ప్రతీ రోజు కిచిడి చారు పప్పు అన్నం పెడుతున్నారని విద్యార్థులు తెలిపారు. అదేవిధంగా సరిపడా మరుగుదొడ్లు లేవన్నారు. మెనూ ప్రకారం భోజనం పెట్టమని కోరుతున్నట్టు తెలిపారు. ఈ సమస్యలను పరిష్కరించాలని కోరారు.

సీఎంఆర్ఎఫ్ చెక్కుల అందజేత



నవతెలంగాణ-నేరడిగొండ

మండల కేంద్రంలోని ఎమ్మెల్యే నివాసంలో శుక్రవారం పలువురు లబ్ధిదారులకు ఎమ్మెల్యే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందజేశారు. అందులో ఇచ్చోడ మండలంలోని దుబార్‌పేట్ గ్రామానికి చెందిన కె.సంధ్యారాణికి రూ.58వేలు, బోథ్ మండలంలోని కనుగుట్ట గ్రామానికి చెందిన ఓస విజయ రూ.60వేలు, బి.నారాయణకు రూ. 8వేలు, భీంపూర్ మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌కు రూ.12వేలు, విజయకు రూ.60వేలు, మండలంలోని కుంటాల గ్రామానికి చెందిన జాధవ్ జ్యోతికి రూ.50వేలు, సవర్గావ్ గ్రామానికి చెందిన స్వరూపకు రూ.75వేల చెక్కులు మంజూరయ్యాయి. కాగా వీటిని ఎమ్మెల్యే లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఇచ్చోడ మండల తాజా మాజీ ఎంపీపీ ప్రీతమ్‌రెడ్డి, నాయకులు పిడుగు అభిరాంరెడ్డి, బుచ్చన్న, శ్యామ్, రవికాంత్ ఉన్నారు.

ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం అభినందనీయం

- డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

రిమ్స్‌కు వచ్చే రోగి సహాయకులకు గత 12 సంవత్సరాలుగా సత్యసాయి ట్రస్టు ఆధ్వర్యంలో అన్నదానం చేపట్టడం అభినందనీయమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. శుక్రవారం రిమ్స్‌లోని సత్యసాయి నిత్యాన్నదాన ట్రస్టులో అన్నదాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ముందుగా సత్యసాయి చిత్రపటానికి పూజలు చేసి హారతి ఇచ్చారు. అనంతరం సత్యసాయి ట్రస్టును సందర్శించి అన్నదానం గురించి తెలుసుకొని అభినందించారు. రిమ్స్‌కు వచ్చే పేద రోగుల సహాయకుల కోసం నిత్యం అన్నదానం చేయడం అభినందనీయమని డీఎల్ఎస్ఏ కార్యదర్శి సౌజన్య అన్నారు. 12 సంవత్సరాల నుంచి దాదాపు 20 లక్షలకు పైగా మందికి అన్నదానం చేసినట్లు నిర్వాహకులు తెలిపారన్నారు. సత్యసాయి బాబా 99వ జన్మదినాన్ని పురస్కరించుకొని తనకు హారతిలో భాగస్వాములు చేయడం సంతోషంగా ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సత్యసాయి సేవ సమితి సభ్యులు నర్సింహరావు, గంగారాం, విజయ్‌రెడ్డి, అశోక్, వీణ పాల్గొన్నారు.

అనారోగ్యంతో మాజీ సర్పంచ్ మృతి

నవతెలంగాణ-బోథ్



మండలంలోని గుట్టపక్క తండా గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ సకర్వాల్ సరిత శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందింది. కుటుంబీకులు తెలిపిన వివరాల ప్రకారం... ఆమె గత ఆరు నెలల నుంచి అనారోగ్యం బాధపడుతోంది. శుక్రవారం మృతి చెందింది.

సమయపాలన పాటించని వైద్య సిబ్బంది



నవతెలంగాణ-ఇంద్రవెల్లి

ఏజెన్సీలోని మారుమూల గ్రామాల ప్రజలకు రౌండ్ ది క్లాక్ సేవలు అందించాల్సిన వైద్యసిబ్బంది సమయపాలన పాటించక పోవడంతో రోగులు నానా అవస్థలు పడుతున్నారు. మండలంలోని మారుమూల ప్రాంతంలోని పిట్టబొంగరం పీహెచ్‌సీలోని సిబ్బంది స్థానికంగా ఉండక సధూర ప్రాంతం నుంచి రాక పోకలు సాగించడం దీనికి నిదర్శనం. ఇక్కడ విధులు నిర్వర్తించే డాక్టర్‌తో పాటు ఇతర సిబ్బంది జిల్లా కేంద్రం, ఉట్నూర్ నుంచి తమ సొంత గ్రామాల నుంచి రాక పోకలు కొనసాగించడంతో రోగులు వారి కోసం ఎదురు చూడాల్సిన దుస్థితి నెలకొంది. శుక్రవారం ఆ పీహెచ్‌సీలో ఉదయం 10.30 గంటల వరకు కేవలం ఒకే స్టాఫ్ నర్సుతో పాటు లాబ్ టెక్నీషియన్ మాత్రమే విధుల్లో ఉన్నారు. వైద్యుడు మాత్రం జిల్లా కేంద్రంలో తనకు మీటింగ్ ఉందని సిబ్బంది తెలిపారు. ఇతర సిబ్బంది మాత్రం సమయ పాలన పాటించక సకాలంలో హాజరు కావడం లేదని గ్రామస్తులు పేర్కొన్నారు. ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి, ఈ పీహెచ్‌సీలోని సిబ్బంది సమయపాలన పాటించే విధంగా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

జిల్లా గెజిటెడ్ అధికారుల కమిటీ ఏకగ్రీవ ఎన్నిక

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా గజిటెడ్ అధికారుల జిల్లా కమిటీ ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలో నిర్వహించిన జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం కమిటీ ఎన్నికలలో నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఎన్నికల అధికారిగా వ్యవహరించిన తెలంగాణ గెజిటెడ్ అధికారుల సెంట్రల్ అసోసియేషన్-హైదరాబాద్ సంయుక్త కార్యదర్శి ఎ. పరమేశ్వర్‌రెడ్డి తెలిపారు. జిల్లా గెజిటెడ్ అధికారుల సంఘం అధ్యక్షులుగా డివిజనల్ పంచాయతీ అధికారి ఉమర్ హుస్సేన్, అసోసియేట్ అధ్యక్షులుగా వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డా. ఎం విజయ్, ఉపాధ్యక్షులుగా నాయబ్ తహసీల్దార్ జాదవ్ జితేందర్, కౌటాల మండల పరిషత్ అభివృద్ధి అధికారి కోట ప్రసాద్, వైస్ ప్రెసిడెంట్-మహిళగా ఖజానా శాఖ ఉప అధికారి జి భానుమతి, కార్యదర్శిగా నాయబ్ తహసిల్దార్ ఎస్ పోచయ్యతో పాటు మొత్తం 15 మందితో జిల్లా కార్యవర్గాన్ని ఎన్నుకున్నట్లు తెలిపారు.

ప్రజా పాలన విజయోత్సవాలు విజయవంతం చేయాలి

ఆసిఫాబాద్ : ప్రభుత్వం చేపట్టిన ప్రజా పాలన ప్రజా విజయోత్సవాలలో భాగంగా ఈ నెల 23వ తేదీన జిల్లాలో జరగనున్న ప్రత్యేక కార్యక్రమాన్ని అధికారులు, ప్రజా ప్రతినిధులు సమన్వయంతో పని చేసి విజయవంతం చేయాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అధికారం చేపట్టి సంవత్సరం కావస్తున్నందున ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 6 గ్యారెంటీలు అమలు జరుగుతున్నందున ప్రభుత్వం ఈ నెల 19వ తేదీ నుంచి డిసెంబర్ 7వ తేదీ వరకు ప్రజా పాలన విజయోత్సవాలు నిర్వహించడం జరుగుతుందని, ఇందులో భాగంగా ఈ నెల 23వ తేదీ సాయంత్రం నాలుగు గంటలకు జిల్లా కేంద్రంలోని జనకాపూర్ లోగల తాటియా గార్డెన్స్‌లో నిర్వహించ తలపెట్టిన విజయోత్సవ వేడుకలను విజయవంతం చేయాలని తెలిపారు. ప్రభుత్వం అమలు చేస్తున్న మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రూ.500 గ్యాస్ రాయితీ, లబ్ధిదారులకు 200 యూనిట్ల ఉచిత విద్యుత్, రైతు రుణమాఫీ, ఇందిరా మహిళా శక్తి, ఉద్యోగాల కల్పన, ఇందిరమ్మ ఇండ్లు, యువ వికాసం వంటి పథకాలపై రాష్ట్రం నుండి వచ్చే అంతడుపుల నాగరాజుతో కూడిన 80 మంది సాంస్కృతిక కళాకారుల బృందంతో నిర్వహించే కార్యక్రమాలను విజయవంతం చేయాలని తెలిపారు.

టి-ప్రైడ్ పథకం రాయితీ మినహాయింపు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రభుత్వం అమలు చేస్తున్న టి-ప్రైడ్ పథకంలో షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలకు చెందిన వారికి ట్యాక్సీ ప్లేట్ కార్లు, ట్యాక్సీలకు అందించే రాయితీ పథకం నుంచి మినహాయించడం జరిగిందని జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ మదిరే అశోక్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. రవాణా రంగంలో భాగంగా జేసీబీలు, డెలివరీ వ్యాన్లు, జట్ కింగ్ మెషిన్లు, ట్యాక్సీ ప్లేట్ కార్లు, ట్యాక్సీలు రాయితీ ద్వారా పొందడం జరిగిందని, డిసెంబర్ 1వ తేదీ నుండి ట్యాక్సీ ప్లేట్ కార్లు, ట్యాక్సీలకు సబ్సిడీ పొందేందుకు టి-ప్రైడ్ పథకం నుంచి మినహాయించడం జరిగిందని, ట్యాక్సీ ప్లేట్ కార్లకు తప్ప మిగతా వాహనాలు అన్నింటికీ పథకంలో ఎలాంటి మార్పులు చేయలేదని తెలిపారు. షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్ తెగలు వర్గాలకు చెందిన వారు మార్పులను గమనించి దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు.

రుచికరమైన వంటలు చేయాలి



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని ఐటీడీఏ పరిధిలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలో విద్యార్థులకు రుచికరమైన వంటలను వండి పెంట్టాలని గిరిజన సంక్షేమ శాఖ డిడి రమాదేవి అన్నారు. శుక్రవారం ఆదర్శ క్రీడా పాఠశాలలో జిల్లాలోని కుక్, కామాటీలకు ఒకరోజు ఓరియంటేషన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఆశ్రమ పాఠశాలల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని వంటగదులను, స్టోర్ రూములను ఎప్పటికప్పుడు శుభ్రపరుస్తూ ఉండాలన్నారు. కూరగాయలను శుభ్రంగా ఉంచాలన్నారు. అడ పీహెచ్‌సీ వైద్యాధికారి, ఫుడ్ అడ్వైజరీ కమిటీ సభ్యుడు వినోద్ కుమార్ మాట్లాడుతూ కుక్, కామాటీలకు పలు సూచనలు సలహాలను అందించారు. ఈ కార్యక్రమంలో ఏటీడీఓలు చిరంజీవి, శ్రీనివాస్, కమర్ హుస్సేన్, జీసీడీఓ శకుంతల, జిల్లా స్పోర్ట్స్ అధికారి మీనా రెడ్డి, హెచ్ఎం జంగు పాల్గొన్నారు.

ప్రారంభమైన సమగ్ర సర్వే డాటా ఎంట్రీ



నవతెలంగాణ-ఆసిఫాబాద్

రాష్ట్ర ప్రభుత్వం చేపట్టిన సమగ్ర కుటుంబ సర్వేలో భాగంగా ఈ నెల 6వ తేదీ నుండి జిల్లాలో సిబ్బంది సేకరించిన ఇంటింటి సర్వే సమాచారాన్ని ప్రత్యేక కేంద్రాల ద్వారా ఎంపీడీఓ కార్యాలయాల్లో ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు. జిల్లా కేంద్రంలోని ఎంపీడీఓ కార్యాలయంలో ప్రత్యేక అధికారి ఆర్డీఓ లోకేశ్వరరావు సమాచార నమోదు ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వేలో భాగంగా సేకరించిన సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నిక్షిప్తం చేస్తున్నట్లు వివరించారు. ఇప్పటికే జిల్లాలో సర్వే పూర్తికావడానికి వచ్చిందని సమాచారాన్ని ఆన్‌లైన్‌లో నమోదు చేస్తే సర్వే పూర్తవుతుందన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ శ్రీనివాస్, తహసీల్దార్ రోహిత్ దేశ్‌పాండే పాల్గొన్నారు.

పెన్షన్‌దారుల రిలే దీక్షలకు మాజీ ఎంపీపీ మద్దతు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

వృద్ధులు, వికలాంగులు, వితంతువులు తమ పెన్షన్లు పెంచుతామని ప్రభుత్వం ఇచ్చిన హామీని నెరవేర్చాలని గత నాలుగు రోజులుగా చేస్తున్న రిలే నిరాహార దీక్షలు ఐదో రోజుకు చేరుకున్న సందర్భంగా శుక్రవారం మాజీ ఎంపీపీ మల్లికార్జున్ దీక్షలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు పెన్షన్లు పెంచాలని డిమాండ్ చేశారు. పింఛన్దారులకు అండగా ఉంటామని పునరుద్ఘాటించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్ జాతీయ ఉపాధ్యక్షుడు రేగుంట కేశవ్, బీజేపీ నాయకులు ఉత్తమ్ నాయక్, సుంకరి పెంటయ్య, ఎమ్మార్పీఎస్ అధికార ప్రతినిధి రేగుంట మహేష్, వికలాంగ హక్కుల పోరాట సమితి రాష్ట్ర నాయకుడు ఇస్లాం బిన్ హసన్, జిల్లా అధ్యక్షుడు బన్న మూర్తి, నాయకులు బురం శ్రీనివాస్, కూటికల రాజయ్య, నారాయణగౌడ్, బొట్టుపెల్లి నర్సుబాయి, తిరుపతమ్మ, లక్ష్మి, అశోక్, మొండి పాల్గొన్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ఇంటర్నెట్ వినియోగం పెరుగుతున్న నేపథ్యంలో కొంతమంది సైబర్ నేరగాళ్లు మోసాలకు పాల్పడుతున్నారని, వారి పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్‌బీఐ మేనేజర్ రవికుమార్ అన్నారు. జిల్లా కేంద్రంలోని విశ్రాంత ఉద్యోగుల సంఘ భవనంలో సంఘం జిల్లా అధ్యక్షుడు కరుణగౌడ్ అధ్యక్షతన నిర్వహించిన సైబర్ నేరాలపై అవగాహన సదస్సుకు జనకాపూర్ బ్రాంచ్ మేనేజర్ జీవన్, గోలేటి బ్రాంచ్ మేనేజర్ సుహాస్ ప్రేమ్‌చంద్, రెబ్బెన మేనేజర్ యాదవరావుతో కలిసి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. డబ్బులకు సంబంధించి ఆండ్రాయిడ్ మొబైల్ ఫోన్లకు వచ్చే లింకులను ఓపెన్ చేయకూడదని, ఓటీపీలు ఎవరికి చెప్పకూడదని సూచించారు. నేరాల పట్ల అప్రమత్తంగా లేకుంటే డబ్బులు కోల్పోయే ప్రమాదం ఉంటుందన్నారు. మోసపోయామని తెలిసిన వెంటనే దగ్గరలోని బ్యాంకులను లేదా కస్టమర్ సర్వీస్ నెంబర్ సంప్రదించాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో యూనిట్ సహాయ అధ్యక్షుడు అచ్యుత్‌రావు, సంఘం జిల్లా నాయకులు మధుసూదన్‌గౌడ్, నాంపల్లి శంకర్, మల్లయ్య, పుల్లూరి శంకర్, లింగన్న, బాల శ్రీరాములు, వెంకన్న, సిడాం సూరు, నర్సయ్య, వెంకన్న, తుకారాం, దుర్గం శ్యామ్‌రావు, మధుకర్, కనకమ్మ, సిరాజుల్ హక్, పిల్లి సత్యమ్మ, అమల మేరీ, జీస్విన, గజ్జెల పోచన్న, రాజేశ్వర్, వెంకటేష్, రామ్ ప్రసాద్, నర్సయ్య, పుల్లయ్య, మధుకర్, జబ్బార్, వీరభద్రయ్య పాల్గొన్నారు.

ఆశ్రమ బాలుర పాఠశాలలో కలెక్టర్ బస

- మెనూ, బోధన తీరుపై ఆరా
- పాఠశాల అభివృద్ధి పనులు వేగవంతం చేయాలి



నవతెలంగాణ-కెరమెరి

ప్రభుత్వ ఆదేశాల మేరకు నెలలో ఒకరోజు విద్యార్థులతో కార్యక్రమంలో భాగంగా కలెక్టర్ వెంకటేష్ దౌత్రే శుక్రవారం మండలంలోని హట్టి ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. విద్యార్థులు పుష్పగుచ్ఛం అందించి ఘన స్వాగతం పలికారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడారు. తరగతుల వారీగా విద్యాబోధనపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మధ్యాహ్నం, సాయంత్రం మెనూ వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులు ఫిజిక్స్ సబ్జెక్టు చదువుతుండగా సంబంధిత ఉపాధ్యాయుడిని బోధన తీరుతో పాటు వివిధ అంశాలను అడిగి తెలుసుకున్నారు. రాత్రిపూట ఏ సమయం వరకు చదువుతున్నారని విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ఉన్నత చదువులు చదివి జీవితంలో ఏం కావాలనుకుంటున్నారనే ప్రశ్నించగా ఓ విద్యార్థి ఐఏఎస్ కావాలని అనుకుంటున్నానని అని సమాధానం ఇవ్వడంతో అందుకు కలెక్టర్ సంతృప్తి వ్యక్తం చేశారు. ఇప్పటి నుండే కఠోర సాధన మొదలుపెట్టాలని విద్యార్థులకు సూచించారు. ఓ విద్యార్థి వేసిన చిత్రలేఖనాన్ని పరిశీలించారు. చదువుతో పాటు విద్యార్థులు అన్ని రంగాల్లో సృజనాత్మకతను పెంపొందించుకోవాలన్నారు. పాఠశాలలో చేపడుతున్న అభివృద్ధి పనులను పరిశీలించి, పనుల్లో వేగం పెంచాలని ఆదేశించారు. అనంతరం డైనింగ్ హాల్ తనిఖీ చేశారు. డైనింగ్ హాల్‌లోని సౌకర్యాలను పరిశీలించి అధికారులతో మాట్లాడి పాఠశాల స్టాఫ్, విద్యార్థుల వివరాలు అడిగి తెలుసుకున్నారు. విద్యార్థులతో మాట్లాడి రోజూ మెనూ ప్రకారం నాణ్యమైన భోజనం అందిస్తున్నారా? లేదా? అని, ఇతరత్రా వారికున్న సమస్యలు, ఇబ్బందులు అడిగి తెలుసుకున్నారు. అనంతరం విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. కలెక్టర్ వచ్చిన సందర్భంగా విద్యార్థులు సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహించారు. పాఠశాల డార్మెటరీలో విద్యార్థులు, ఉపాధ్యాయులతో కలిసి కలెక్టర్ రాత్రి అక్కడే నిద్రించారు. కార్యక్రమంలో డిడి రమాదేవి, విద్యాధికారి ఆడే ప్రకాష్, ఎంపీడీవో అంజాద్ పాషా, డిప్యూటీ తహసీల్దార్ సంతోష్ కుమార్, ఇన్‌చార్జి ఎస్ఐ అంజయ్య, ఆశ్రమ పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు పంచపూల, ఆర్ఐ పవన్, పంచాయతీ కార్యదర్శులు, ఈశ్వర్, సతీష్‌రావు, గణేష్ పాల్గొన్నారు.

సొంత భవనం నిర్మించాలని వినతి



నవతెలంగాణ-కాగజ్‌నగర్

పట్టణంలోని మహాత్మ జ్యోతి బాపులే బాలుర గురుకులానికి స్వంత భవనం నిర్మించాలని కోరుతూ గురుకులం ప్రిన్సిపల్ మంగ కలెక్టర్ వెంకటేష్ దోత్రేకు వినతిపత్రం అందించారు. శుక్రవారం గురుకులాన్ని ఆకస్మికంగా సందర్శించిన కలెక్టర్ విద్యార్థులను అక్కడి పరిస్థితుల గురించి అడిగి తెలుసుకున్నారు. విద్యార్థుల హాజరు శాతం పరిశీలించారు. పరిసరాల పరిశుభ్రతతో పాటు కిచెన్ గదిని పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ మంగ సమస్యలను కలెక్టర్‌కు వివరించారు. స్వంత భవనం లేక ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని ప్రిన్సిపల్ మంగ కలెక్టర్‌కు వివరించారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమాధికారి సజీవన్ పాల్గొన్నారు.

బాలికల కళాశాల వసతి గృహాన్ని ప్రారంభించాలి

ఆసిఫాబాద్ : జిల్లాలో నిర్మాణం పూర్తయి ప్రారంభానికి నోచుకోని బీసీ బాలికల కళాశాల వసతి గృహాన్ని వెంటనే ప్రారంభించేలా చర్యలు తీసుకోవాలని డీవైఎఫ్ఐ జిల్లా అధ్యక్షుడు టీకానంద్ డిమాండ్ చేశారు. శుక్రవారం బీసీ సంక్షేమ శాఖ జిల్లా అధికారి సజీవన్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కేంద్రంలో బీసీ బాలికల వసతి గృహంలో సుమారు 50 మంది విద్యార్థులు ఉన్నారన్నారు. ఈ కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి గొడిసెల కార్తీక్, జిల్లా ఉపాధ్యక్షురాలు చాపిడి శ్రావణి పాల్గొన్నారు.



యువత భవిష్యత్తు బంగారుమయంగా మార్చుకోవాలి

- ఆసిఫాబాద్ కలెక్టర్ వెంకటేష్ ధోత్రే



నవతెలంగాణ-ఆసిఫాబాద్

యువత తమ భవిష్యత్తును బంగారు మయంగా మలచుకోవాలని కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. శుక్రవారం పోటీ పరీక్షలకు సన్నద్ధం అవుతున్న యువతకు నిర్వహించిన కార్యక్రమంలో ధర్మసేవ స్వచ్ఛంద సంస్థ-హైదరాబాద్ ప్రతినిధులు రిషాంత్‌రెడ్డి, శ్రీనివాస్‌లతో కలిసి హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువత తమ కెరీర్‌ను సరైన మార్గంలో ఎంచుకుని మంచి భవిష్యత్తును తయారు చేసుకోవాలని, ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకుని సాధించే దిశగా పట్టుదలతో కృషి చేయాలని తెలిపారు. సమాజంలో ఉన్నతమైన స్థానాన్ని సంపాదించుకోవాలని, ఎందుకు ప్రతి ఒక్కరు కష్టపడాలని తెలిపారు. ముఖ్యంగా యువత నైపుణ్యత వైపు దృష్టిసారించాలని, మానసికంగా దృఢంగా ఉండాలని, చెడు మార్గాల వైపు వెళ్లకూడదని తెలిపారు. ధ్యానం, యోగ, నిస్వార్థ సేవ, నాయకత్వ లక్షణాలు కలిగి ఉండాలని, మాదకద్రవ్యాలకు బానిసలు అయితే జీవితాన్ని నష్టపోతారని తెలిపారు. ఈ సందర్భంగా ధర్మసేవ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు యువత, పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులకు కెరీర్ గైడెన్స్‌పై పలు సూచనలు చేశారు. ఈ కార్యక్రమంలో పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులు, యువత పాల్గొన్నారు.

సైన్స్ ఎగ్జిబిషన్‌లో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలో ఈ నెల 27, 28 తేదీల్లో జరగనున్న జిల్లా స్థాయి ఇన్‌స్పైర్ ఎగ్జిబిషన్ బాల వైజ్ఞానిక ప్రదర్శనలు ప్రతి పాఠశాల విద్యార్థులు భాగస్వాములు అయ్యేలా చూడాలని జిల్లా విద్యాధికారి యాదయ్య తెలిపారు. సైన్స్ ఎగ్జిబిషన్‌కు సంబంధించి అన్ని పాఠశాలల ప్రధానోపాధ్యాయులతో అధికారులతో కలిసి గూగుల్ మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో ఈ నెల 27, 28వ తేదీలలో ఇన్‌స్పైర్, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనని నిర్వహిస్తున్నట్టు దీనిలో జిల్లాలో 108 ప్రాజెక్టులు పాల్గొంటారని తెలిపారు. గత సంవత్సరం ఇన్‌స్పైర్ జాతీయ స్థాయి ఎగ్జిబిషన్‌లో ఆసిఫాబాద్ జిల్లాకు చెందిన నవోదయ విద్యార్థిని పాల్గొన్నదని, రాష్ట్రీయ బాల వైజ్ఞానిక ప్రదర్శనలో గత సంవత్సరం ఉపాధ్యాయుల ప్రదర్శనలో మామిడాల తిరుపతయ్యకు సంబంధించిన ప్రయోగం దక్షిణ భారత స్థాయికి ఎన్నిక అయిందని తెలిపారు. ప్రస్తుత సంవత్సరం కూడా అదే స్ఫూర్తి కొనసాగించాలన్నారు. ఈ సంవత్సరం రాష్ట్ర వైజ్ఞానిక ప్రదర్శన 'సుస్థిర అభివద్ధిలో శాస్త్ర సాంకేతిక రంగాల ప్రాముఖ్యత' అనే అంశంపై నిర్వహించబడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా సైన్స్ అధికారి కటకం మధూకర్, కమిటీ మెంబర్లు వాసాల ప్రభాకర్, జాడి దేవాజి, ఉదయ బాబు, రాథోడ్ సుభాష్ పాల్గొన్నారు.

హార్వెస్టర్ ఫ్యాన్ 19ఆర్‌పిఎం ఉండేలా చూడాలి

నవతెలంగాణ-జన్నారం

రైతులు వరి కోత సమయంలో హార్వెస్టర్ ఫ్యాన్ స్పీడ్ 19ఆర్‌పిఎం ఉండేలా చూసుకోవడం ద్వారా తాలు, తప్ప లేని నాణ్యమైన వడ్లను పొందవచ్చని కవ్వాల్ క్లస్టర్ ఏఈఓ అక్రమ్ అన్నారు. శుక్రవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామంలో వరి కోత యంత్రాల వద్దకు వెళ్లి రైతులకు పలు సూచనలు అందించారు. తూర్పార పట్టిన, తగిన తేమ శాతం వచ్చే వరకు ధాన్యాన్ని ఎండబెట్టిన తరువాత కొనుగోలు కేంద్రాలకు తీసుకురావాలని సూచించారు. రైతులు వాసాల నరేష్, రవి, అనుమాల వేణు, గాజుల రవి, శ్రీను ఉన్నారు.

ఎస్సై బాధ్యతల స్వీకరణ




నవతెలంగాణ-బెజ్జూర్

బెజ్జూర్ ఎస్ఐగా ప్రవీణ్ కుమార్ శుక్రవారం బాధ్యతలను స్వీకరించారు. గతంలో లింగాపూర్ ఎస్ఐగా పనిచేసిన ప్రవీణ్ కుమార్ ఇటీవల బెజ్జూర్‌కు బదిలీ కావడంతో బాధ్యతలు స్వీకరించారు. గతంలో పనిచేసిన ఎస్ఐ విక్రం ఆసిఫాబాద్ జిల్లా హెడ్ క్వార్టర్‌కు అటాచ్ చేశారు. ఈ సందర్భంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్ఐ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ శాంతిభద్రతల పరిరక్షణకు చర్యలు తీసుకుంటానని తెలిపారు. ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పేర్కొన్నారు. ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకురావాలని కోరారు. ఫ్రెండ్లీ పోలీస్ విధానంతో పని చేస్తానని తెలిపారు.

బెజ్జూర్ ఎంతో నేర్పింది : ఎస్ఐ విక్రం

గత సంవత్సర కాలం నుంచి బెజ్జూర్ ఎస్ఐగా పనిచేసిన తనకు బెజ్జూర్ మండల ప్రజల నుంచి ఎంతో నేర్చుకున్నాని ఎస్ఐ విక్రం అన్నారు. శుక్రవారం మండలంలోని కుకుడా గ్రామంలో ఏర్పాటు చేసిన వీడ్కోలు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రజలకు అందుబాటులో ఉంటూ తన వంతు సేవను చేశానని అన్నారు. మండల ప్రజలు చూపిన మమకారాన్ని మరువలేనని అన్నారు. అనంతరం గ్రామస్తులు శాలువాతో సన్మానించారు. ఈ కార్యక్రమంలో బెజ్జూర్ ఎస్ఐ ప్రవీణ్ కుమార్, నాయకులు రహమత్, అస్లాం పురుషోత్తం, రాజలింగు పాల్గొన్నారు.

గర్భస్థ మహిళల మరణాలను నివారించాలి

నవతెలంగాణ-నిర్మల్

గర్భస్థ మహిళల మరణాలను నిర్మూలించేందుకు పటిష్ట చర్యలు చేపట్టాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని తన ఛాంబర్‌లో గర్భస్థ మరణాలపై వైద్యశాఖ అధికారులతో సమీక్షించారు. ఇప్పటికే గర్భస్థ మహిళల మరణాలను నియంత్రించేందుకు తమ ఆధ్వర్యంలో హైపవర్ కమిటీని ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. జిల్లా ప్రభుత్వ ప్రసూతి ఆసుపత్రిలో ఏఎన్ఎం, ఆశా, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల వైద్యులకు హైరిస్కు గర్భిణుల గుర్తింపు, గర్భస్థ మరణాల నియంత్రణకు చేపట్టవలసిన చర్యలపై వారానికి కొందరు వైద్యులు, సిబ్బంది చొప్పున విస్తృత శిక్షణ కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. హై రిస్క్ గర్భస్థ మహిళలకు ఎదురయ్యే సమస్యల పరిష్కారం కోసం జిల్లాలో హెల్ప్ లైన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ హెల్ప్ లైన్ కేంద్రాల ద్వారా నలుగురు ఏఎన్ఎం, సిబ్బంది గుర్తించిన హైరిస్క్ గర్భిణులకు ఒక్కొక్కరిగా ఫోన్లు చేసి, వారి ఆరోగ్య స్థితి గతుల వివరాలను తెలుసుకొని, వారికి అవసరమగు వైద్య సేవల వివరాలను తెలియజేయనున్నట్లు తెలిపారు. ఇప్పటికే హైరిస్క్ గర్భిణులకు సంబంధించిన వివరాలు, వారి స్థితిగతులకు సంబంధించి సమాచారాన్ని తెలుసుకోవడానికి నెలవారీగా సమీక్ష సమావేశాలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. గర్భం దాల్చిన వెంటనే మహిళలందరూ అవసరమైన మేరకు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని సూచించారు. వైద్యుల సూచనల మేరకు వివిధ రక్త పరీక్షలను చేసుకొని మందులను వాడాలన్నారు. సమావేశంలో డిఎంహెచ్ఓ డా.రాజేందర్, వైద్యులు సురేష్, శ్రీనివాస్, సౌమ్య పాల్గొన్నారు.

పట్టణ ప్రాంతాల్లో వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేయాలి

పట్టణ ప్రాంతాలలో వంద శాతం పన్నుల వసూలు పూర్తి చేయాలని కలెక్టర్ అభిలాష అభినవ్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో మున్సిపల్ శాఖ పరిధిలోని పలు అంశాలపై సమీక్షించారు. అన్ని రకాల పన్నుల వసూలను వంద శాతం పూర్తి చేయాలన్నారు. నిర్ణీత సమయానికి పన్నులు చెల్లించని వారికి నోటీసులు జారీ చేసి, చట్ట ప్రకారం చర్యలు తీసుకోవాలన్నారు. ఎల్ఆర్ఎస్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. సంబంధిత అధికారులంతా క్షేత్రస్థాయిలో పర్యటించి ఎల్ఆర్ఎస్ దరఖాస్తులను పరిశీలించి పూర్తి చేయాలన్నారు. అన్ని రకాల వ్యాపారాలకు సంబంధించి వాణిజ్య లైసెన్సులను మంజూరు చేయాలన్నారు. ప్రతి ఒక్క వ్యాపారస్తుడు సంబంధిత లైసెన్సులను పొందే విధంగా అవగాహన కల్పించాలన్నారు. పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను అన్యాక్రాంతం కాకుండా రక్షించాలని తెలిపారు. ప్రభుత్వ భూములను ఆక్రమించిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. మెప్మా శాఖ వారి పరిధిలోని అన్ని పనులను వెంటవెంటనే పూర్తి చేయాలన్నారు. నర్సరీలలో మొక్కలను పెంచేందుకై విత్తన టెండర్లకు సంబంధించిన వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. సమావేశంలో నిర్మల్, ఖానాపూర్, భైంసా మున్సిపల్ కమిషనర్లు ఖమర్ అహ్మద్, మనోహర్, రాజేష్ కుమార్, మెప్మా పీడీ సుభాష్ పాల్గొన్నారు.

ప్రభుత్వ భూములను కాపాడాలి

నవతెలంగాణ-తాండూర్

ప్రభుత్వ భూములను కాపాడాలని ఎంసిపిఐయు జిల్లా కార్యదర్శి సబ్బని రాజేంద్రప్రసాద్ అన్నారు. శుక్రవారం బెల్లంపల్లి పట్టణ పరిధిలోని ప్రభుత్వ భూములను కాపాడాలని తహసీల్దార్ జ్యోత్స్నకు వినతి పత్రం అందించి మాట్లాడారు. బెల్లంపల్లి పట్టణంలో ప్రభుత్వ భూములు కబ్జాకు గురవుతున్నాయని, పాలిటెక్నిక్ కళాశాల ముందు గల భూమి, 2వ వార్డ్ ఇందిరమ్మ కాలనీలోని అంగన్వాడీ సెంటర్‌కు చెందిన భూమిని కబ్జా చేస్తున్నారని తెలిపారు. నకిలీ పేపర్స్ సృష్టించి కోర్టులను సైతం బురిడీ కొట్టిస్తూ స్టే ఆర్డర్స్ తీసుకొస్తున్నారన్నారు. ప్రభుత్వ స్థలాలను కబ్జా చేసి నిర్మాణాలు చేపడుతున్నప్పటికీ అధికారులు అడ్డుకోవడంలో విఫలమవుతున్నారని తెలిపారు. భూకబ్జాలు జరగకుండా అధికారులు చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో మండల, పట్టణ కార్యదర్శులు ఆరెపల్లి రమేష్, సతీష్ పాల్గొన్నారు.

కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలి

నవతెలంగాణ-తాండూర్

రైతులు వడ్ల కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని తహసీల్దార్ ఇమ్రాన్‌ఖాన్ అన్నారు. శుక్రవారం మండలంలోని రేచీని, అచలాపూర్, తాండూర్ కొనుగోలు కేంద్రాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం నాణ్యమైన వరి ధాన్యానికి క్వింటాల్‌కు రూ.2300, అదనంగా రూ.500 బోనస్ చెల్లిస్తుందని తెలిపారు. రైతులు ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ది పొందాలని తెలిపారు. దళారులను నమ్మి మోసపోవద్దన్నారు. వరి కోత సమయంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలన్నారు. ధాన్యంలో తాలు, పొల్లు రాకుండా జాగ్రత్త పడాలని సూచించారు. ధాన్యాన్ని నిర్ణీత తేమ శాతం వచ్చేవరకు ఆరబెట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల వద్ద వసతులను, తేమ పరికరాలను పరిశీలించారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ అధికారి సుష్మ, ఆర్ఐ ఏజాజోద్దీన్, పిఏసిఎస్ సెక్రెటరీ శ్రీనివాస్, ఏఈఓ శంకర్, మాజీ సర్పంచ్ రమేష్ ఉన్నారు.

దేవాలయాలకు నిధులు మంజూరు చేయాలని వినతి

నవతెలంగాణ-బోథ్

నియోజకవర్గంలోని దేవాలయాలకు పెండింగ్‌లో ఉన్న నిధులను వెంటనే మంజురు చేయాలని కోరుతూ శుక్రవారం సచివాలయంలో దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖను కాంగ్రెస్ నియోజకవర్గ ఇన్చార్జి ఆడే గజేందర్ కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆలయాలకు పెండింగ్‌లో ఉన్న నిధులను విడుదల చేసి టెండర్ దశలో ఉన్న బోథ్ పట్టణ కేంద్రంలోని భక్త శివ మార్కండేయ ఆలయానికి టెండర్లు పిలవాలని కోరారు. అన్ని దేవాలయాలకు కావలసిన నిధులు వెంటనే మంజూరు చేయాలని కోరారు. మంత్రిని కలిసిన వారిలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్, మాజీ కేంద్ర మంత్రి వేణుగోపాలచారి, ఆదివాసి కాంగ్రెస్ రాష్ట్ర వైస్ చైర్మన్ కొమురం కోటేశ్వర్, జిల్లా అధికార ప్రతినిధి పసుల చంటి, నాయకులు మెరుగు భోజన్న, మాజీ ఎంపీపీ మల్లేష్ ఉన్నారు.

జాతీయ స్థాయి పోటీలకు క్రీడా పాఠశాల విద్యార్థినులు

నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లాలోని గిరిజన ఆదర్శ క్రీడా పాఠశాలలో చదువుతున్న ఐదుగురు విద్యార్థినులు జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైనట్లు క్రీడా అధికారి బండ మీనారెడ్డి, క్రీడ పాఠశాల ప్రధానోపాధ్యాయుడు జంగు తెలిపారు. ఎస్‌జిఎఫ్ అండర్ 14 హ్యాండ్ బాల్ పోటీలకు అమూల్య, ముత్తుబాయి, అనిత, మౌనిక ఈ నెల 25 నుంచి 29 వరకు ఛత్తీస్‌ఘడ్ రాష్ట్రంలో జరిగే 68వ హ్యాండ్ బాల్ పోటీల్లో పాల్గొననున్నారు. అదేవిధంగా ఈ నెల 25 నుంచి 30 వరకు ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని లక్నోలో జరిగే అండర్ 17 అథ్లెటిక్స్ జాతీయ స్థాయి పోటీల్లో నందిని పాల్గొననుట్లు వెల్లడించారు. జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులను పలువురు అభినందించారు. ఈ కార్యక్రమంలో శిక్షకులు విద్యాసాగర్, అరవింద్, తిరుమల్ పాల్గొన్నారు.

చెట్లను నరికిన వ్యక్తి బైండోవర్

నవతెలంగాణ-జన్నారం



మండలంలో అక్రమంగా టేకు చెట్లు నరికిన బాదంపల్లికి చెందిన జాడి రాజంను స్థానిక తహసీల్దార్ రాజ మనోహర్‌రెడ్డి ఎదుట బైండోవర్ చేసినట్లు జన్నారం ఇన్‌చార్జి ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ సుష్మారావు శుక్రవారం తెలిపారు. నిందితుడైన రాజం అక్రమంగా టేకు చెట్లను నరుకుతూ, రవాణా చేస్తున్నారనే అభియోగం మేరకు తమ ఫారెస్ట్ సెక్షన్, బీట్ ఆఫీసర్లు మధుకర్, తన్వీర్ పాషా, ఎస్.శ్రీనివాస్‌లు అదుపులోకి తీసుకొని స్థానిక తహసీల్దార్ ఎదుట బెండోవర్ చేశారన్నారు. అనంతరం రూ.25వేల పూచికత్తుపై విడుదల చేశారు.

రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థినులు

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రాష్ట్ర స్థాయి కబడ్డీ పోటీలకు గురుకుల విద్యార్థినులు ఎంపిక అయినట్లు ప్రిన్సిపల్ కె రమా కళ్యాణి తెలిపారు. ఈ నెల 23, 24 తేదీల్లో రంగారెడ్డిలో జరగనున్న రాష్ట్రస్థాయి కబడ్డీ పోటీలకు అండర్-19 బాలికల విభాగం నుంచి తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల(బాలికల) పాఠశాల/ కళాశాల, లక్సెట్టిపేట నుంచి ఏ నందిని, కె శ్రీవల్లి, ఎం స్పందన విద్యార్థినిలు ఎంపికైనారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్, వైస్ ప్రిన్సిపల్ మహేశ్వరరావు, శ్రీలత, పీఈటీ రమాదేవి, మమత సిబ్బంది క్రీడాకారులను అభినందించారు.

విధులకు సక్రమంగా హాజరు కావాలి



నవతెలంగాణ-నస్పూర్

సింగరేణిలో పనిచేసే ఉద్యోగులు సక్రమంగా విధులకు హాజరు కావాలని ఎస్ఆర్పీ-1, 3 గ్రూప్ ఏజెంట్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం వార్షిక సంవత్సరంలో 100 కన్నా తక్కువ మస్టర్లు చేసిన కార్మికులకు ఎస్ఆర్పీ-1 క్యాంటీన్ హాల్‌లో కౌన్సిలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏజెంట్ మాట్లాడుతూ సింగరేణి సంస్థలో ఉద్యోగం పొందడం ఒక వరం అని, సక్రమంగా విధులకు హాజరయ్యి వృత్తిలో ఉన్నత స్థితికి చేరుకొని కుటుంబాన్ని ఆర్థికంగా నిలబెట్టుకోవడమే కాకుండా పిల్లలను ఉన్నత విద్యావంతులుగా తయారు చేయాలని సూచించారు. అనంతరం గని మేనేజర్ విజయ్ కుమార్ మాట్లాడుతూ ఉద్యోగులు నాగాలు చేయకుండా చూడాల్సిన బాధ్యత వారి కుటుంబ సభ్యులపై ఉన్నదని, నాగాలు చేయకుండా పూర్తి సహకారం అందించాలని, అలాగే కంపెనీ అందించే సంక్షేమ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో గని సంక్షేమాధికారి ఎస్.సాధన్, పీఓఏ సత్యనారాయణ, సీనియర్ అసిస్టెంట్ క్రాంతికుమార్, గుర్తింపు సంఘం (ఏఐటీయూసీ) శ్రీరాంపూర్ బ్రాంచ్ అసిస్టెంట్ సెక్రెటరీ మోతుకూరి కొమరయ్య, పిట్ సెక్రెటరీ దాడి రాజయ్య, ఉత్తమ ఉద్యోగి ఎస్డీఎల్ ఆపరేటర్ శ్రీనివాస్, సతీష్ పాల్గొన్నారు.

ఉపాధి హామీ ద్వారా మహిళా శక్తి ఉపాధి భరోసా

నవతెలంగాణ-తాండూర్



ఎన్ఆర్ఈజీఎస్‌లో భాగంగా మహిళా శక్తి ఉపాధి భరోసా పథకం కింద కోళ్ల షెడ్లు, పశువుల కొట్టాల నిర్మాణానికి దరఖాస్తు చేసుకోవాలని ఏపీఓ నందకుమార్ నవతెలంగాణతో తెలిపారు. స్వయం సహాయక సంఘ సభ్యుల అభ్యున్నతి కోసం పథకాన్ని ప్రభుత్వం చేపట్టినట్లు వివరించారు. లబ్ధిదారులు ఎస్‌హెచ్‌జీ సభ్యులై ఉండాలన్నారు. ఉపాధి హామీ జాబ్ కార్డు కలిగిన రైతులు ల్యాండ్ లెవలింగ్ పనుల మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రభుత్వం పోడు పట్టాలు అందించిన రైతులకు ప్రాధాన్యత ఉంటుందని పేర్కొన్నారు. పొలం బాట కార్యక్రమంలో భాగంగా గ్రామాలలో గ్రావెలింగ్ ఫార్మేషన్ రోడ్ల నిర్మాణానికి అంచనాలు తయారు చేస్తున్నట్లు తెలిపారు. వ్యవసాయ అభివృద్ధిలో భాగంగా వర్మి కంపోస్ట్ ఫిట్ మంజూరుకు దరఖాస్తు చేసుకోవాలని కోరారు. 2024-25 సంవత్సరానికి గాను జల నిధి పథకం కింద వ్యవసాయ బావుల నిర్మాణం చేపట్టనున్నట్టు చెప్పారు. గ్రామీణ పారిశుధ్య విభాగంలో వ్యక్తిగత ఇంకుడు గుంతలు కమ్యూనిటీ ఇంకుడు గుంతలు, డ్రైనేజ్ ఎండింగ్ పాయింట్, ఇంకుడు గుంతలు వ్యక్తిగత మరుగుదొడ్ల నిర్మాణం చేపట్టనున్నట్లు తెలిపారు.

మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయండి



నవతెలంగాణ-జన్నారం

మాలల సింహ గర్జన సభను విజయవంతం చేయాలని జిల్లా మాలల జేఏసీ కన్వీనర్ తొగరి సుధాకర్ మాల మహానాడు మండల అధ్యక్షుడు పాత బాలరాజు అన్నారు. డిసెంబర్ 1న హైదరాబాదులోని పేరేడ్ గ్రౌండ్లో నిర్వహించే మాలల సింహ గర్జన సభ పోస్టర్లను శుక్రవారం మాల సంఘం ఆధ్వర్యంలో ఆవిష్కరించారు. ముందుగా అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళ్లు అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎస్సీ వర్గీకరణకు తాము వ్యతిరేకులం అన్నారు. హైదరాబాదులో నిర్వహించే ఈ సభకు మాలలు అధికంగా తరలివెళ్లి విజయవంతం చేయాలన్నారు. జిల్లా మాలమహానాడు గజేల్లి లక్ష్మన్, జూపాక సుదీర్, భూపెల్లి మల్లన్న, రాష్ట్ర కార్యదర్శి బెంజమెన్, శరత్ బొజ్జ, మాజీ ఎంపీటీసీ దాముక కరుణాకర్, సిటిమల భరత్ కుమార్, కుంబాల రాజన్న పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి పోటీలకు ఎంజేపీ విద్యార్థుల ఎంపిక

నవతెలంగాణ-లక్షెట్టిపేట



రాష్ట్రస్థాయి పోటీలకు లక్షెట్టిపేట ఎంజేపీ విద్యార్థులు ఎంపికైనట్లు ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ తెలిపారు. గురువారం మంచిర్యాల మోడల్ స్కూల్‌లో జరిగిన అండర్-17,19 బాక్సింగ్ జోనల్ పోటీల్లో ఎంజేపీ బాయ్స్ విద్యార్థులు ప్రతిభ కనపర్చి గోల్డ్ మెడల్ సాధించి, రాష్టస్తాయి పోటీలకు ఎంపికయ్యారని ఎస్‌జీఎఫ్ జిల్లా కార్యదర్శి ఫణిరాజా తెలిపారు. విద్యార్థుల ఎంపిక పట్ల ప్రిన్సిపాల్ రోనాల్డ్ కిరణ్ సంతోషం వ్యక్తం చేసారు. లక్షెట్టిపేట ఎంజేపీ బాయ్స్ ఏ పోటీలో అయినా రాష్ట్ర స్థాయి, జాతీయ స్థాయిలలో ప్రతిభ కనబర్చి, ఉమ్మడి ఆదిలాబాద్‌కు పేరు తీసుకురావాలని ఆకాంక్షించారు. ఇందుకు కృషి చేసిన పీడీ, పీఈటీలకు అభినందనలు తెలిపారు.

బొగ్గు బ్లాక్‌లను సింగరేణికే కేటాయించాలి

• సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో సంతకాల సేకరణ

నవతెలంగాణ-నస్పూర్



నస్పూర్‌లో..

బొగ్గు బ్లాకుల వేలంపాటను రద్దుచేసి వాటిని సింగరేణికే కేటాయించాలని సీపీఐ(ఎం) జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు గోమాస ప్రకాష్ అన్నారు. శుక్రవారం సీపీఐ(ఎం) ఆధ్వర్యంలో నస్పూర్‌లోని ఎస్ఆర్పీ ఓసీ, నస్పూర్ ఆటో అడ్డ, భవన నిర్మాణ కార్మికులతో సంతకాల సేకరణ చేపట్టారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ మంచిర్యాల జిల్లా పారిశ్రామికంగా అభివృద్ధి చెందుతుందని, జిల్లాలోని శ్రావణపల్లి బొగ్గు బ్లాక్‌ను వేలం పాటలో పెట్టడానికి కేంద్ర ప్రభుత్వం హైదరాబాదులో ఏర్పాటుచేసిన సమావేశంలో కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి బొగ్గు బ్లాక్‌లను వేలం పాటలో పెట్టుబడి దారులకు అప్పగించేందుకు ప్రయత్నిస్తున్నారని విమర్శించారు. ప్రయివేట్ పరం అయితే మంచిర్యాల జిల్లా ప్రజలు, సింగరేణి మీద ఆధారపడి అనేక వృత్తులు, చిన్న చిన్న వ్యాపారాలు నడుపుకుంటున్న వారు ఆర్థిక ఇబ్బందులకు గురవుతారన్నారు. పేద బడుగు బలహీన వర్గాలకు ఉచిత కరెంటు అవకాశం ఉండదని, తక్షణమే కేంద్ర ప్రభుత్వం చేసే బగ్గు బ్లాక్ల వేలంపాటను వెనక్కి తీసుకోని సింగరేణి సంస్థకే ఇవ్వాలని సీపీఐ(ఎం) డిమాండ్ చేస్తోందన్నారు. లేని యెడల రాబోయే రోజులలో పెద్ద ఎత్తున ఆందోళన చేపట్టేందుకు ప్రజలందరూ సిద్ధమై సింగరేణి కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ(ఎం) జిల్లా కమిటీ సభ్యులు ప్రేమ్ కుమార్, నాయకులు మిడివెల్లి రాజ్ కుమార్, మోహన్, మహేష్, పాయిరాల రాములు పాల్గొన్నారు.

కాసిపేట : అంబానీకి బీఎస్ఎన్ఎల్, ఆదానీకి సింగరేణి ఆస్తులు కట్టబెడుతున్నారని సీపీఐ(ఎం) నాయకులు మండి పడ్డారు. శుక్రవారం మండలంలోని కాసిపేట-2 ఇన్‌క్లైన్ గని, కొండాపూర్ యాప, మల్కెపల్లి, కోమటిచేను, ముత్యంపల్లి, కాసిపేట ప్రాంతాల్లో కార్మికుల, ప్రజల, రైతుల, మహిళల, కూలీలతో సమావేశాలు జరుపుతూ సంతకాల సేకరణ కార్యక్రమం చేపట్టారు. ఈ సందర్భంగా సీపీఐ(ఎం) నాయకులు మాట్లాడుతూ వ్యవసాయానికి, గృహాలకు ఉచిత విద్యుత్‌కు మంగళం పాడతారని, సింగరేణి సంస్థను నమ్ముకొని వచ్చిన యువ కార్మికులను ప్యాకేజి పేరుతో భవిష్యత్తులో గెంటివేసే కుట్ర చేస్తుందని, బీజేపీ, మోడీ కుట్రలతో తెలంగాణకు నష్టమేనని తెలిసిన కాంగ్రెస్, ఇతర పార్టీల నాయకులు నోరు మెదపడం లేదని మండి పడ్డారు. పోరాటాలతోనే మూడు పార్టీలకు బుద్ధి చెప్పాలని, సింగరేణిని కాపాడుకోవాలని ప్రజలకు, కార్మికులకు పిలుపు నిచ్చారు. అంబానీని శత కోటీశ్వరుడిని చేయడం కోసం జియో పేరుతో బీఎస్ఎన్ఎల్‌ను బలి తీసుకోవడం జరిగిందన్నారు. నేడు బొగ్గు బ్లాక్‌ల వేలం పాట పేరుతో అదానీకి కట్ట బెట్టడంతో తనను ప్రపంచంలో మొదటి కుబేరుడిని చెయ్యడం కోసమే సింగరేణి సంస్థను బలిపీఠం ఎక్కించడం జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి సంకె రవి, జిల్లా కమిటీ సభ్యులు దూలం శ్రీనివాస్, నాయకులు సిడం జంగుబాయి పాల్గొన్నారు.



కాసిపేట : గనిపై కార్మికులతో సంతకాలు సేకరిస్తున్న సీపీఐ(ఎం) నాయకులు

సర్వే వివరాలు తప్పులు లేకుండా నమోదు చేయాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-నస్పూర్



ప్రభుత్వం చేపట్టిన సమగ్ర సర్వే ప్రక్రియలో ఎన్యుమరేటర్లు సేకరించిన వివరాలు తప్పులు లేకుండా ఆన్‌లైన్‌లో స్పష్టంగా నమోదు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ సూచించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో అదనపు కలెక్టర్ సబావత్ మోతిలాల్, ముఖ్య ప్రణాళిక అధికారి మహ్మద్ ఖాసీం, జిల్లా పంచాయతీ అధికారి వెంకటేశ్వర్‌రావులతో కలిసి ప్రత్యేక అధికారులు, మున్సిపల్ కమీషనర్లు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మండల పంచాయతీ అధికారులు, డాటా ఎంట్రీ ఆపరేటర్ల శిక్షణ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ సర్వే ప్రక్రియలో ఎన్యుమరేషన్ బ్లాక్లను కేటాయించి ఎన్యుమరేటర్ల ద్వారా ఆయా బ్లాక్లలోని కుటుంబ సభ్యుల వివరాలు సేకరించడం జరిగిందని, ఇట్టి సమాచారాన్ని ప్రభుత్వం నిర్దేశించిన నమూనాలో పూర్తి స్థాయిలో నమోదు చేయడం జరిగిందని తెలిపారు. ఈ నేపథ్యంలో ఎన్యుమరేటర్లు అందించిన పూర్తి సమాచారాన్ని డాటా ఎంట్రీ ఆపరేటర్ల తమకు కేటాయించిన మేరకు ఎలాంటి పొరపాట్లు లేకుండా ప్రభుత్వ పోర్టల్లో స్పష్టంగా నమోదు చేయాలని తెలిపారు. నిర్దేశిత గడువులోగా నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా వేగవంతం చేయాలని, జిల్లాలో 562 మంది డాటా ఎంట్రీ ఆపరేటర్లను నియమించడం జరిగిందని, ఒక్కొక్కరికి 300 కుటుంబాల సమాచారం అందించడం జరుగుతుందని, ఒక రోజులో కనీసం 30 కుటుంబాలకు తగ్గకుండా సమాచారం పోర్టల్లో నమోదు చేయాలని తెలిపారు. డిసెంబర్ 1వ తేదీ లోగా వివరాలు నమోదు ప్రక్రియ పూర్తి చేసే విధంగా అధికారులు పర్యవేక్షించాలని, వీలైతే బదిలీల పద్ధతిలో ప్రక్రియ కొనసాగించాలని, ఎలాంటి పొరపాట్లకు తావు లేకుండా నిర్వహించాలని తెలిపారు. ఆపరేటర్లు డాటా ఎంట్రీలో ఏమైనా సందేహాలు ఉన్నట్లయితే పైఅధికారులను సంప్రదించి వివరాలు స్పష్టంగా నమోదు చేయాలని, వివరాలు గోప్యంగా ఉంచాలని, నిర్లక్ష్యం, అలసత్వం వహించినా, నిబంధనలు ఉల్లంఘించినా చర్యలు తీసుకోవడం జరుగుతుందని తెలిపారు. అనంతరం పవర్ పాయింట్ ప్రజంటేషన్ ద్వారా వివరాలు నమోదు తీరును వివరించారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు పాల్గొన్నారు.



మద్దతు ధరకే ధాన్యం కనుగోలు చేయాలి

• మంచిర్యాల కలెక్టర్ కుమార్ దీపక్

నవతెలంగాణ-లక్షెట్టిపేట



ప్రభుత్వ ఆదేశాల మేరకు జిల్లాలో కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేసి కనీస మద్దతు ధరతో రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేయాలని కలెక్టర్ కుమార్ దీపక్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన వరిధాన్యం కొనుగోలు కేంద్రాన్ని ఆకస్మికంగా సందర్శించి ప్రక్రియను పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాల ద్వారా రైతుల నుంచి ధాన్యం కొనుగోలు చేసి మద్దతు ధర చెల్లిస్తుందని, సన్నరకం వడ్లకు మద్దతు ధరతో పాటు అదనంగా రూ.500 బోనస్ ఇవ్వడం జరుగుతుందని, సన్నరకం ధాన్యాన్ని వ్యవసాయ విస్తరణాధికారులు గుర్తించి ధ్రువపత్రం జారీ చేయాలని, సన్నరకం, దొడ్డురకం వడ్లను వేర్వేరుగా కొనుగోలు చేయాలని తెలిపారు. క్వింటాల్ ఏ గ్రేడ్ రకానికి రూ.2,320లు, సాధారణ రకానికి రూ.2,300లు చెల్లించడం జరుగుతుందని తెలిపారు. రైతులు ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాలకు తీసుకువచ్చే సమయంలో 17 శాతం కంటే తక్కువగా తేమ శాతం ఉండాలని, తాలు, మట్టిగడ్డలు లేకుండా నిబంధనలను పాటిస్తూ నాణ్యమైన ధాన్యాన్ని తీసుకురావాలని, కొనుగోలు కేంద్రాలలో రైతుల సౌకర్యార్థం మౌళిక వసతులు కల్పించడం జరిగిందని తెలిపారు. వరి పంట పూర్తి కోత దశకు వచ్చిన తరువాత హార్వెస్టర్ యంత్రంలో నిర్దిష్ట ఫ్యాన్ వేగంతో పంట కోయాలని తెలిపారు. కొనుగోలు కేంద్రాలలో తూకం, తేమ యంత్రాలు, తాగునీరు, నీడ, గన్ని సంచులు, టార్పాలిన్లు అందుబాటులో ఉంచాలని, కొనుగోలు కేంద్రాల నిర్వాహకులకు నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని, కొనుగోలు సమయంలో సంబంధిత రైతులకు రశీదు జారీ చేయాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంబంధిత అధికారులు, కొనుగోలు కేంద్రం నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.



తేమ శాతం తగ్గాకే కొనుగోలు కేద్రానికి తేవాలి : ఏఈఓ త్రిసంధ్య



నవతెలంగాణ-జన్నారం

తేమ శాతం తగ్గిన తర్వాతే వరి ధాన్యాన్ని రైతులు కొనుగోలు కేంద్రాలకు తరలించాలని జన్నారం క్లస్టర్ ఏఈఓ త్రిసంధ్య సూచించారు. శుక్రవారం మండల కేంద్రంలోని మార్కెట్ యార్డు సమీపంలో ఏర్పాటు చేసిన ఐకేపీ కొనుగోలు కేంద్రాన్ని ఆమె పరిశీలించారు. ధాన్యంలో తాలు, తప్ప లేకుండా చూసుకోవాలన్నారు. అలాగే హార్వెస్టర్ ఫ్యాన్ స్పీడు 17 నుంచి 20 లోపల ఉండాలని, పొలాల్లో రైతులు వరి కొయ్యలను కాల్చవద్దని ఏఈఓ సూచించారు. ఐకేపీ సిబ్బంది రైతులు పాల్గొన్నారు.

శివాలయం వద్ద అన్నదానం



నవతెలంగాణ-తాండూర్

మండలంలోని భక్త మార్కండేయ శివ ఆలయం వద్ద కార్తీక మాసం సందర్భంగా అన్నదానం నిర్వహించారు. అన్నదానంలో తాండూర్ ఐబీ పరిసర ప్రాంత ప్రజలు పాల్గొన్నారు. వ్యాపారస్తులు గందె శ్రీనివాస్ స్వప్న దంపతుల కుమారుడు శ్రీకాంత్ పుట్టినరోజు సందర్భంగా అన్నదానం నిర్వహించారు.


వృద్ధులకు దుప్పట్లు పంపిణీ

నవతెలంగాణ-జన్నారం



మండల కేంద్రంలో ఎటువంటి ఆదరణకు నోచుకోని నిరుపేద వృద్ధులకు బీజేవైఎం మండల అధ్యక్షుడు ముడుగు ప్రవీణ్ దుప్పట్లు పంపిణీ చేశారు. శుక్రవారం స్థానిక బస్టాండ్, అంగడిబజార్ ఏరియాలలో నిరాదరణకు గురైన వృద్ధులకు దుప్పట్లను అందించారు. చలి తీవ్రత పెరుగుతున్న దృష్యా వారికి దుప్పట్లను అందించామన్నారు.

కాసిపేటలో అఘోరాలు



నవతెలంగాణ-కాసిపేట

మండల కేంద్రంలో కోదండ రామాలయంలో అఘోరాలు ప్రత్యక్షమయ్యారు. మధ్య ప్రదేశ్ ఉజ్జయిని నుంచి భయలు దేరి తిరుమల తిరుపతి దేవస్థానికి బయలు దేరి అన్ని దేవాలయాలను దర్శించుకుంటూ వెళ్తున్న క్రమంలో భాగంగా కాసిపేట కోదండ రామాలయంలో దర్శించారు. స్థానికులు భారీగా తరలివచ్చి అఘోరాలను వీక్షించారు. ఈ సందర్భంగా వాళ్ల జాతకాలను చెప్పడం గమనార్హం అఘోరాలు జాతకాలు చెప్పడం ఏంటి పలువురు ప్రశ్నించుకున్నారు. పలువురు మూఢ నమ్మకాలతో జాతకాలను చూపించుకోవడంలో పలువురు విస్మయానికి గురయ్యారు.

పులి దాడిలో మృత్యువాతపడిన పశువులకు నష్టపరిహారం అందజేత



నవతెలంగాణ-పెంచికల్‌పేట్

పెంచికలపేట్ రేంజ్ పరిధిలో పెద్దపులి దాడిలో మరణించిన పశువుల యజమానులు గుండెపల్లి గ్రామానికి చెందిన కిషన్‌రావు రూ. 20000, కమ్మర్గాం గ్రామానికి చెందిన ఆత్రం విష్ణు రూ.14000 చెక్కులను ఫారెస్ట్ రేంజ్ అధికారి అనిల్ కుమార్ అందజేశారు. ఈ కార్యక్రమంలో ఎఫ్ఎస్ఓలు అన్న, జగన్మోహన్‌గౌడ్, ఎఫ్‌బీఓలు విజయలక్ష్మి, శ్రావణ్, సతీష్, లచ్చన్న, మహేష్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
5
ఆదిలాబాద్
శనివారం | నవంబర్ 23, 2024 | www.navatelangana.com

ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను కలిసిన నాయకులు

నవతెలంగాణ-బోథ్

పట్టభద్రుల ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నను శుక్రవారం హైదారాబాద్‌లోని బోథ్ పట్టణ పద్మశాలి సంఘం ఆధ్వర్యంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిసి సన్మానించారు. అలాగే బోథ్ మండలంలోని విద్యా ఉద్యోగ అవకాశాల మెరుగు పరచడానికి తన వంతు కృషి చేయాలని కోరారు. ఎమ్మెల్సీ స్పందిస్తూ, విద్య ఉద్యోగాలకు మెరుగుపరిచేందుకు కృషి చేస్తామన్నారు. కార్యక్రమంలో పట్టణ పద్మశాలి సంఘం అధ్యక్షుడు మెరుగు భోజన్న, గౌరవాధ్యక్షులు గంగుల మల్లేష్, ఆలయ కమిటీ కోశాధికారి కటకం నగేష్, కార్యవర్గ సభ్యుడు తడక పోశెట్టి, జిల్లా తీన్మార్ మల్లన్న టీమ్ అధ్యక్షుడు తాళ్ల రవీందర్ పాల్గొన్నారు.



సమ్మక్క సారలమ్మను దర్శించుకున్న ఎమ్మెల్యే దంపతులు

నవతెలంగాణ-ఉట్నూర్

ములుగు జిల్లా మేడారం గ్రామంలో కొలువుదీరిన ఆదివాసుల ఆరాధ్య దేవతలు సమ్మక్క సారలమ్మలను ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పటేల్ వారి కుటుంబ సభ్యులతో కలిసి శుక్రవారం దర్శించుకున్నారు. ఈ సందర్భంగా సమ్మక్క సారక్క గద్దెల వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ప్రజలంతా సుఖసంతోషాలతో ఆయురారోగ్యాలతో ఉండాలని, పాడి పంటలు బాగా పండాలని వేడుకున్నారు. వారి వెంట సమ్మక్క సారక్క దేవాలయం ఈఓ కొప్పుల రవి, పూజారి స్వామి ఉన్నారు.



విజ్ఞానవంతులు కావాలి

● జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్



నవతెలంగాణ-నిర్మల్

గ్రంథాలయాలను ఉపయోగించుకొని విజ్ఞానవంతులు కావాలని జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ అన్నారు. శుక్రవారం జిల్లా కేంద్రంలోని జిల్లా గ్రంథాలయాన్ని ఆమె సందర్శించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లా గ్రంథాలయంలో వివిధ పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలన్నారు. పోటీ పరీక్షలకు సన్నద్ధమయ్యే అభ్యర్థుల కోసం అన్ని రకాల పుస్తకాలను అందుబాటులో ఉంచాలన్నారు. గ్రంథాలయంలో కుర్చీల కొరత రాకుండా చూడాలన్నారు. అనంతరం పోటీ పరీక్షలకు సన్నద్ధమవుతున్న అభ్యర్థులతో మాట్లాడుతూ వారికి గల అవసరాలను అడిగి తెలుసుకున్నారు. సమయపాలనను పాటిస్తూ శ్రద్ధగా చదివి అనుకున్న లక్ష్యాలను సాధించాలని సూచించారు. గ్రంథాలయంలో ఏవైనా ఇబ్బందులు ఎదురైతే అధికారుల దృష్టికి తీసుకురావాలని తెలిపారు. కార్యక్రమంలో గ్రంథాలయ సంస్థ చైర్మెన్ సయ్యద్ అర్జుమన్ అలీ, తహసీల్దార్ రాజు, అధికారులు మోహన్ సింగ్, విజయశ్రీ, సిబ్బంది పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో యువకుడి మృతి

నవతెలంగాణ-ఇంద్రవెల్లి



మండలంలోని ముత్నూర్ గ్రామానికి చెందిన ముండే దత్త(25) గురువారం రాత్రి రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. బంధువులు, స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... మృతుడి బైక్‌పై ఇంద్రవెల్లి నుంచి ముత్నూర్ వైపు వస్తుండగా, సమ్మక ఎక్స్ రోడ్డు బ్రిడ్జి వద్ద ఎదురుగా వస్తున్న లారీ బలంగా ఢీకొంది. ఇది గమనించిన స్థానికులు 108 అంబులెన్స్‌లో రిమ్స్‌కు తరలించగా అక్కడ చికిత్స పొందుతూ మరణించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఒక్కగానొక్క కుమారుడు రోడ్డు ప్రమాదంలో మృతిచెందడంతో ఆ కుటుంబంలో విషాదఛాయలు అలుముకున్నాయి. స్థానిక పోలీసులు కేసును నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఆదిలాబాద్ వాసులకే ఇవ్వాలి



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి కోసం వేరే మండలానికి చెందిన వ్యక్తుల బయోడేటాలను రాష్ట్ర వ్యవసాయ అధికారులకు పంప వద్దని ఆదివాసీ భారత్ మహాసభ అధ్యక్షులు కినాక సురేష్ అన్నారు. దీనిలో భాగంగా ఆదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్ అర్బన్, మావల, తలమడుగు, తాంసి మండలాల తహసీల్దార్‌లకు వినతిపత్రం అందజేశారు. దీనితో పాటు వ్యవసాయ మార్కెట్ సెక్రటరీకి కూడా వినతిపత్రం ఇచ్చి, జైనథ్ మండలానికి చెందిన మునిగెల విఠల్‌కు సంబంధించిన బయోడేటా రాష్ట్ర వ్యవసాయ అధికారులకు పంపకూడదని వేడుకున్నారు. ఆదిలాబాద్ మార్కెట్ కమిటీ చైర్మెన్ పదవి ఆదిలాబాద్ రూరల్, ఆదిలాబాద్ అర్బన్, మావల, తాంసి, తలమడుగు, భీంపూర్, మండల ప్రజల హక్కు అని అన్నారు. ఈ కార్యక్రమంలో జంగుపటేల్, ముర్తుజాఖాన్ పాల్గొన్నారు.

బీజేపీతోనే విద్యావైద్య ఉపాధి అవకాశాలు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌రూరల్

ఆదిలాబాద్ జిల్లాలో గుండం లొద్ది గ్రామం ఎక్కడ ఉందో కూడా చాలామందికి తెలియదు అలాంటి మారుమూల గ్రామాల్లో కనీస సౌకర్యాలతో పాటు విద్య, వైద్యం, ఉపాధి అవకాశాలను మెరుగుపరిచేందుకు కేంద్ర ప్రభుత్వం ప్రత్యేక పథకాన్ని అమలు చేస్తుందని ఎంపీ గోడం నగేష్, ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. ఆదిలాబాద్ మండలంలోని దివ్యగుడా, పొట్టాంలొద్ది గ్రామాల్లో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి హాజరై ఆయన మాట్లాడారు. చించుఘాట్ నుంచి గ్రామం వరకు బీటి రోడ్డు అయ్యేలా కృషి చేస్తామని ఆయన అన్నారు. గ్రామంలో అనేక సమస్యలు ఉన్నాయని వాటిని ఒక్కొక్కటిగా పరిష్కరిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఆదిలాబాద్ మండల నాయకులు సంతోష్, దయాకర్, స్వామి, ముకుంద్‌రావు, రాజు, తుకారాం పాల్గొన్నారు.

ప్రభుత్వం మెస్‌చార్జీలు పెంచింది : ఎమ్మెల్యే



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

వసతి గృహాల్లోని విద్యార్థులు ఆరోగ్యంగా ఉండాలంటే మెస్ చార్జీలు పెంచాలని అసెంబ్లీలో చర్చించడంతో ప్రభుత్వం సానుకూలంగా స్పందించి మెస్ చార్జీలను పెంచిందని ఎమ్మెల్యే పాయల శంకర్ అన్నారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ కళాశాలలోని ప్రైమరీ బీసీ హస్టల్‌ను సందర్శించారు. పెరిగిన మెస్ చార్జీల విద్యార్థులకు కలిగిన లాభాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యేను విద్యార్థులు శాలువాతో సత్కరించి పుష్పగుచ్చం అందించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వ వసతిగృహాల్లో చదివే పేద విద్యార్థులకు మంచి ఆహారం అందించాలంటే మెస్ చార్జీలు సరిపోవని అసెంబ్లీ సమావేశాల్లో చర్చించడం జరిగిందని అన్నారు. దీనిపై ప్రభుత్వం కూడా కమిటీ ఏర్పాటు చేసి మెస్ చార్జీలను పెంచిందన్నారు. విద్యార్థులు నాణ్యమైన భోజనం మెనూ ప్రకారం అందించాలని హాస్టల్ సిబ్బందికి సూచించారు. తమ పిల్లలను ఏ విధంగా చూసుకుంటారో అదే విధంగా వారిని కూడా చూడాలన్నారు. విద్యార్థులు కష్టపడి చదివి తల్లిదండ్రులు వారిపై పెట్టిన నమ్మకాన్ని కాపాడాలన్నారు. కార్యక్రమంలో హస్టల్ సిబ్బంది. బీజేపీ నాయకులు అశోక్‌రెడ్డి, ముకుంద్, దయాకర్ పాల్గొన్నారు.

మన ఆర్జీయూకేటి మన బాధ్యత : ఎస్పీ

నవతెలంగాణ-ముధోల్



దక్షిణ భారత దేశంలో ప్రసిద్ధిగాంచిన బాసర పుణ్యక్షేత్రంలో గల ట్రిపుల్ ఐటీలో విద్యార్థుల ఆత్మహత్యలు నిర్మల్ జిల్లా ఎస్పీ జానకి షర్మిలను కదిలించాయి. దీంతో జిల్లా ఎస్పీ ట్రిపుల్ ఐటీ శాంతిభద్రతలను కాపాడమే కాకుండా, మానవీయ కోణంలో ఆలోచించి విద్యార్థుల ఆత్మహత్యను నివారించడానికి తనవంతుగా సరికొత్త నినాదాన్ని తెరమీదకి తీసుకొచ్చి పలువురు మన్ననలు పొందుతున్నారు. మన ఆర్జీయూకేటీ మన బాధ్యత నినాదంతో జిల్లా ఎస్పీ ముందుకు కదులుతున్నారు. ఇప్పటికే ట్రిపుల్ ఐటీలో విద్యార్థులతో ఎస్పీ మాట్లాడారు. ఏమైనా విద్యాపరమైన సమస్యలు ఉంటే వీసీకీ తెలియజేయాలని సూచించారు. శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నమైనప్పుడు తక్షణమే తనను నేరుగా సంప్రదించవచ్చని పేర్కొన్నారు. ఆత్మహత్యలతో జీవితాన్ని వృధా చేసుకోవద్దని సూచించారు. విద్యార్థుల ఆత్మహత్యతో ట్రిపుల్ ఐటీ కీ ప్రతిష్టకు మచ్చ వస్తుందని భావించి ఆత్మహత్యల నివారణకు పోలీస్‌శాఖ నడుం బిగించింది. ఇకనుంచి ట్రిపుల్ ఐటీని దత్తత తీసుకుంటున్నట్టు జిల్లా ఎస్పీ స్వయంగా ప్రకటించారు. విద్యార్థుల్లో ఆత్మస్థైర్యం నింపడానికి పోలీస్‌శాఖ ఎప్పటికప్పుడు ప్రత్యేక చర్యలు తీసుకోవడంపై పలువురు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ విషయంపై జిల్లా ఎస్పీ జానకి షర్మిల నవతెలంగాణతో శుక్రవారం సాయంత్రం ఫోన్‌లో మాట్లాడారు. బాసర ఆర్జీయూకేటీలో విద్యార్థులు ఆత్మహత్యలు తనను బాధించాయని అన్నారు. ఆత్మహత్యలతో సమస్యలు పరిష్కారం కావని, ఆత్మస్థైర్యంతో ముందుకెళ్లాలని విద్యార్థులకు ఎస్పీ సూచించారు. విద్యార్థులు బాగా చదువుకొని, ఉన్నత ఉద్యోగాలు సాధించి, ఎందరో మందికి స్ఫూర్తిగా నిలవాలని ఎస్పీ ఆకాంక్షించారు. విద్యార్థులకు జిల్లా పోలీస్ శాఖ ఎప్పుడు అండగా ఉంటుందని ఎస్పీ భరోసా ఇచ్చారు. ఆత్మహత్యల నివారణకు ప్రతి ఒక్కరూ సహకరించాలని కోరారు.

అథ్లెటిక్‌కు జిల్లాలో మంచి ఆదరణ



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

జిల్లాలో అథ్లెటిక్స్‌కు మంచి ఆదరణ వచ్చిందని, గతంలో పోటీల నిర్వహణకు తక్కువ మంది. వచ్చేవారని కానీ ఇప్పుడు పెద్ద ఎత్తున వస్తున్నారని గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి అన్నారు. అథ్లెటిక్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం ఇందిరా ప్రియదర్శిని స్టేడియంలో సబ్ జూనియర్ అథ్లెటిక్ ఎంపిక పోటీలను నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై జెండా ఊపీ పోటీలను ప్రారంభించారు. కాగా అంతకు ముందుకు చిన్నారులు చేసిన నృత్యాలు ఆకట్టుకొగా వారిని సత్కరించారు. అనంతరం వీజీఎస్ అకాడమి వారు క్రీడ పరికారాలను అందించారు. ఈ సందర్భంగా గిరిజన క్రీడాలాభివృద్ధి అధికారి పార్థసారథి మాట్లాడుతూ జిల్లాలో అథ్లెకిట్స్ క్రీడలు దినదిన అభివృద్ధి చెందుతున్నాయన్నారు. గతంలో కేవలం పది మంది కూడా రాకపోయేవారని ఇప్పుడు మాత్రం పెద్ద సంఖ్యలో పిల్లలు రావడం సంతోషంగా ఉందన్నారు. క్రీడాకారులు నిత్యం సాధనలు చేస్తూ పోటీల్లో రాణించాలన్నారు. అథ్లెటిక్స్‌లో రాష్ట్ర స్థాయిలో 9 చాంపియన్‌షిప్‌లు జిల్లాకు వచ్చాయన్నారు. దీని అభివృద్ధికి కృషి అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేష్‌ను ఆయన అభినందించారు. కార్యక్రమంలో అథ్లెటిక్స్ కార్యదర్శి రాజేష్, పేట సంఘం కార్యదర్శి ఎస్.స్వామి, ఎస్జీఎఫ్ కార్యదర్శి కాంతారావ్, లచ్చిరాం, అఖిలేష్, సనాతన ఉత్సవ సమితి అధ్యక్షుడు ప్రమోద్ ఖత్రి ఉన్నారు.

రాష్ట్రాన్ని మతోన్మాద శక్తుల నుంచి రక్షించుకుందాం



నవతెలంగాణ-నిర్మల్‌టౌన్

మతోన్మాద శక్తుల నుంచి తెలంగాణ రాష్ట్రాన్ని రక్షించుకుందామని సీపీఐ(ఎంఎల్) జిల్లా కార్యదర్శి రాజన్న అన్నారు. శుక్రవారం నిర్మల్లో వామపక్ష పార్టీల పిలుపుమేరకు టీఎన్జీఓ సంఘ భవనంలో జిల్లా సదస్సు నిర్వహించారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తెలంగాణ ప్రజల మధ్య మతపరమైన విభేదాలను పెంచేందుకు బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు తీవ్రంగా ప్రయత్నిస్తున్నాయని, మెజారిటీ ఓటు బ్యాంకు రాజకీయాలు చేస్తున్నాయన్నారు. ప్రజలు ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఉపాధి సమస్యలతో సతమతమవుతున్నారని అన్నారు. దీన్ని పక్కదారి పట్టించేందుకు మతపరమైన ఎజెండా ముందుకు తెస్తుందన్నారు. రాష్ట్రంలో అధికారంలో ఉన్న కాంగ్రెస్ ఎన్నికల వాగ్దానాలు అమలు చేయడం లేదని తెలిపారు. కాంగ్రెస్, బీఆర్ఎస్ నాయకులు పరస్పరం ఆరోపణలు, ప్రత్యారోపణలు తప్ప, ప్రజలకు ఏమి చేయడం లేదని అన్నారు. ఈ సదస్సులో వామపక్ష నాయకులు దుర్గం నూతన్ కుమార్, సునారికారి రాజేష్, ఉపాలి, మంచికంటి లక్ష్మణ్, నంది రామయ్య పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం అందించాలి

● డీటీడీఓ అంబాజీ నాయక్



నవతెలంగాణ-కుభీర్

విద్యార్థులకు నాణ్యమైన విద్యతో పాటు నాణ్యతతో కూడిన భోజనాన్ని అందించేలా చూడాలని డీటీడీఓ అంబాజీ నాయక్ అన్నారు. శుక్రవారం కుభీర్ ఆశ్రమ పాఠశాల, డోడర్నా ఆశ్రమ పాఠశాలను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. విద్యార్థులకు వచ్చే నెల నుంచి మారిన మెనూ ప్రకారం భోజనము అందించాలని, అధికారులకు సూచించారు. అదే విధంగా చలి కాలంలో విద్యార్థులకు అవసరమైన రగ్గులు, దుప్పట్లు ఉన్నాయని విద్యార్థులకు అడిగితెలుసుకున్నారు. పాఠశాలలో వంట గదులను పరిశీలించి వంట గదిని ఎప్పటికప్పుడు శుభ్రంగా ఉండేలా చూడాలన్నారు. విద్యార్థుల తరగతి గదిలోకి వెళ్లి విద్యార్థులకు పాఠశాలలో ఏమైనా ఇబ్బందులు ఉన్నాయా అని అడిగితెలుసుకున్నారు. అక్కడి నుంచి పాఠశాల కార్యాలయంలో ఉన్న పలు రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట పాఠశాల ప్రధానోపాధ్యాయులు, చిన్నన్న, ఉపాధ్యాయులు ఉన్నారు.

ప్రభుత్వాస్పత్రిలోనే ప్రసవాలు జరగాలి

● ఆదిలాబాద్ జిల్లా కలెక్టర్ రాజర్షిషా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ప్రభుత్వాస్పత్రిలోనే వందశాతం ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలి కలెక్టర్ రాజర్షిషా అన్నారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన వైద్య, మహిళా శిశుసంక్షేమశాఖ అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడారు. ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో వైద్యులు అందుబాటులో ఉండి ప్రజలకు మెరుగైన సేవలందించాలన్నారు. గర్భిణీ స్త్రీలను ప్రయివేట్ ఆస్పత్రులకు పంపించకుండా స్థానిక ఆస్పత్రిలోనే ప్రసవాలు జరిగేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఆశ, ఏఎన్ఎం, అంగన్‌వాడీ టీచర్‌లు ఇంటింటికి వెళ్లి గర్భిణిస్త్రీలను రిజిస్ట్రేషన్ చేయించి, వారికి పౌష్టికాహారం అందించాలన్నారు. ప్రభుత్వాస్పత్రుల్లో డెలవరి అయ్యేలా అవగాహన కల్పించాలని అన్నారు. అనంతరం మెడికల్ ఆఫీసర్‌లను పీహెచ్‌సీల వారిగా వివరాలు అడిగి తెలుసుకున్నారు.

పాఠశాలకు క్రీడా పరికరాలు అందజేత



నవతెలంగాణ-బోథ్

మండలంలోని దన్నూర్(బి) గ్రామంలోని జిల్లా ప్రజా పరిషత్ ఉన్నత పాఠశాలకు శుక్రవారం ఇటీవల ప్రభుత్వ ఉద్యోగం సాధించిన చౌకి చంద్రకాంత్, ఎస్‌కే హైదర్, అలాగే ప్రయివేటు చిరుఉద్యోగి రత్నపురం లింగన్న, క్రీడా పరికరాలను అందజేశారు. పాఠశాలలో క్రీడా పరికరాల కొరత ఉండటంతో వారు స్పందించి పాఠశాల పూర్వ విద్యార్థులుగా తమ వంతుగా డాక్టర్ గంగారాం చేతుల మీదుగా ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు రాజుకు అందించారు. మానవతా దృక్పథంతో యువకులు చేసిన సహాయాన్ని గ్రామస్తులు అభినందించారు. కార్యక్రమంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులు రావుల శంకర్, వ్యాయమ ఉపాధ్యాయురాలు సంగీత, షేక్ అలీ, విద్యార్థులు పాల్గొన్నారు.

పలు కుటుంబాలను పరామర్శించిన ఎమ్మెల్యే



నవతెలంగాణ-తలమడుగు

మండలంలోని రుయ్యాడి గ్రామానికి చెందిన బొజ్జ మిట్టయ్య భార్య, కొత్వాల్ శంకర్ తల్లి, జువ్వాక పేటన్న కుమారుడు ఉశన్న అనారోగ్యాలతో మరణించడంతో బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం పరామర్శించారు. ఎమ్మెల్యే వెంట మండల నాయకులు కేదారేశ్వర్‌రెడ్డి, అభిరామిరెడ్డి, జువ్వాక నర్సింలు, అబ్దుల్లా, నెట్టడి గంగాధర్, సుదర్శన్‌రెడ్డి, శంకర్, నాయకులు కార్యకర్తలు ఉన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత



నవతెలంగాణ-తాంసి

మండలంలోని నిపాని గ్రామానికి చెందిన నవీన్‌గౌడ్‌కు శుక్రవారం బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ నేరడిగొండలోని తన నివాసంలో లబ్ధిదారునికి రూ.16 వేల సీఎంఆర్‌ఎఫ్ చెక్కును అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ నిరుపేద కుటుంబాలు అనారోగ్య బారిన పడిన వారికి అత్యవసర సమయంలో ఆరోగ్యశ్రీ పథకం అమలు కాని వారు కార్పొరేట్ ఆస్పత్రుల్లో సొంత డబ్బుల చెల్లించి, చికిత్సలు చేసుకొన్న వారికి సీఎంఆర్‌ఎఫ్ ఎంతో ఉపయోగ పడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ రాజన్న, నాయకులు ముకుంద్, సంతోష్ ఉన్నారు.